ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 25.0



జయ కృష్ణాముకుందా మురారి

చినవెంకన్న వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఉదయం స్వామి హనుమద్వాహనంపై తిరువీధుల్లో ఊరేగారు. అలంకార సేవల్లో భాగంగా శ్రీకృష్ణుని అలంకరణలో శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఎదుర్కోలు ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. కాగా స్వామివారి కల్యాణం ఆదివారం జరగనుంది. - లోపలి పేజీలో

గట్టు జారితే గల్లంతే..!



అఖండ గోదావరి ఏటిగట్లు పలుచోట్ల ప్రమాదకర స్థితిలో వున్నాయి. పోలవరం గట్టు నుంచి నరసాపురం వశిష్ఠ గోదావరి సముద్రంలో సంగమం అయ్యే ప్రాంతం వరకు 130 కిలోమీటర్ల నిడివిన ఏటిగట్టు నిర్వహణలో నిర్లక్ష్యం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. పలు చోట్ల గట్టు బలహీనంగా మారింది. రానున్న వర్షాకాలంలో వరదలొస్తే ఇబ్బందులు తప్పవన్న భయాందోళన పరీవాహక ప్రజల్లో కనిపిస్తోంది. ప్రస్తుతం వేసవి సీజన్ కావడంతో గట్టు పటిష్ఠతపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' బృందం ఏటిగట్లను పరిశీలన చేయగా పలు అంశాలు వెలుగుచూశాయి. కొన్నిచోట్ల గట్టు జారిపోతూ వున్నాయి. మరికొన్నిచోట్ల మట్టిని తవ్వేశారు. పైచిత్రం పోలవరం వద్ద ఏటిగట్టు పరిస్థితి ఇలా వుంది..

లోపలి పేజీలో..

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు 20వ తేదీతో ముగుస్తాయి. ప్రధాన పరీక్షలు 17నే పూర్తవుతాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ రెగ్యులర్ పరీక్షల్లో ఫెయిలైనవారికి సప్లిమెంటరీ పరీక్షలను ఉద్దేశించగా, వీరితోపాటు రెగ్యులర్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆయా సబ్జెక్టుల్లో మరిన్ని మార్కులను సాధించేందుకు ఇంప్రూవ్‌మెంట్/బెటర్‌మెంట్ వెసులుబాటును ఉపయోగించుకుని పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులున్నారు. ఉదయం 9నుంచి 12గంటల వరకు జరిగే ప్రథమ సంవత్సరం పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 34 కేంద్రాలు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 23 కేంద్రాలను ఎంపిక చేశారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల బండిళ్లను శుక్రవారం ఆయా పరీక్ష కేంద్రాలకు సమీపంలోని పోలీసు స్టేషన్లకు తరలించి భద్రపరిచారు. జవాబుపత్రాల మూల్యాంకనం ఈనెల 18 నుంచి ప్రారంభ మయ్యే అవకాశాలున్నాయి. ఈ దఫా సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికగా ఏలూరులో చేపట్టనున్నారు. కాగా రెగ్యులర్ పరీక్షల్లో ఫెయిలైన ప్రథమ సంవత్సరం జనరల్ విభాగం విద్యార్థులు 5,134 మందిలో సప్లిమెంటరీ పరీక్షలకు 4,067 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఒకేషనల్ విభాగంలో 1,200 మంది ఫెయిల్డ్ విద్యార్థుల్లో సప్లిమెంటరీ పరీక్షలకు 728 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ పరీక్షల్లో జనరల్ విభాగం విద్యార్థులు 2,639 మంది ఫెయిలవ్వగా వీరిలో సప్లిమెంటరీకి 2,362మంది, ఒకేషనల్ విభాగంలో 693 మంది ఫెయిల్‌కాగా సప్లిమెంటరీ పరీక్షలకు 673 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు బెటర్‌మెంట్/ఇంప్రూవ్ మెంట్ వెసులుబాటును వినియోగించుకుని ఆయా సబ్జెక్టుల్లో పరీక్షలకు హాజరు కానున్న ప్రథమ సంవత్సరం జనరల్ విభాగం విద్యార్థులు 9,143 మంది, ఒకేషనల్ విభాగం విద్యార్థులు 925 మంది ఉన్నారు. రెగ్యులర్/సప్లిమెంటరీ పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చినవాటినే సంబంధిత సబ్జెక్టుకు పరిగణన లోకి తీసుకుంటారు.

జీవో తెచ్చిన.. తంటా!



జిల్లాలో నూతన భవన నిర్మాణాలకు బ్రేక్ పడింది. జిల్లాలో ఏలూరు నగరపాలక సంస్థతోపాటు నూజి వీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, మునిసి పాలిటీల్లో మూడునెలలుగా ఒక ప్లాన్ రాలేదు. దీనికి కారణం జీవో నెం.20గా పేర్కొనవచ్చు. సామాన్యుల మేలు కోరి తీసుకొచ్చిన జీవోనే వారిని ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెనుకడుగు వేసేలా చేస్తోంది.

- భవన నిర్మాణ ప్లాన్స్ అప్రూవల్స్ సరళతరానికి జీవో-20 అమలు
- మూడు నెలలుగా నో ప్లాన్స్..నో అప్రూవల్
- ఎల్‌టీపీలు, నిర్మాణదారుల్లో ఆందోళన
- ప్రణాళిక విభాగం ఆదాయానికి గండి

(ఏలూరు టూటౌన్-ఆంధ్రజ్యోతి)

భవన నిర్మాణ ప్లాన్ అప్రూవల్స్ సరళతరం చేయడానికి ప్రభుత్వం జీవో నంబరు 20 తీసుకొచ్చింది. ఈ జీవోలో నిబంధనల కారణంగా భవన నిర్మాణ యజమానులు ప్లాన్ తీసుకోవడానికి భయపడుతున్నారు. ప్లాన్‌లు ఇవ్వడానికి లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ జంకుతు న్నారు. గతంలో భవనం నిర్మించుకోవడానికి ఎల్‌టీపీలు ప్లాన్ వేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. జిల్లాలోని మునిసిపాలిటీలు ప్రణాళిక విభాగం సిబ్బంది, అధికారులు ఆ ప్లాన్‌ను సరి చూసి అప్రూవల్ చేసేవారు. అనంతరం భవన నిర్మాణాన్ని యజమాని ప్రారంభించేవాడు. ప్లాన్ ప్రకారం భవన నిర్మాణం జరుగుతుందా.. లేదా అని ప్రణాళిక విభాగం సిబ్బంది పర్యవేక్షించేవారు. ప్లాన్ ప్రకారం కట్టకుండా నిర్మాణంలో డివియేషన్ అయితే జరిమానా విధిం చేవారు. చిన్నచిన్న పొరపాట్లను పట్టించుకునేవారు కాదు.

జీవోతో అందరూ వెనుకడుగు

భవనాలు నిర్మించుకునే నిర్మాణదారులు ప్లాన్ అప్రూవల్ కావాలంటే అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వస్తుందనే భావనతో ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేసింది. జీవో నంబరు 20 తీసుకొచ్చింది. మునిసిపల్ అధికారులకు, సిబ్బందికి అధికారాలు తొలగించి ఆ అధికారాలను లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీలకు) కట్టబెట్టింది. భవన నిర్మాణదారుడు ప్లాన్‌లు డివియేట్ చేస్తూ నిర్మాణం కొనసాగిస్తే అతనిపైనా చర్యలు తీసుకునేందుకు జీవోలో పేర్కొంది. ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతుందా.. లేదా.. అని ఎల్‌టీపీలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఏదైనా నిర్మాణాల విషయంలో పొరపాట్లు జరిగితే ఎల్‌టీపీల లైసెన్స్‌లను రద్దు చేస్తామని జీవోలో ప్రభుత్వం హెచ్చరించింది. అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించింది. దీనివల్ల భవనాలు నిర్మించుకునే యజమానులు, ప్లాన్‌లు ఇచ్చే ఎల్‌టీపీలు ముందుకురావడంలేదు.

ఆదాయానికి గండి

గత మూడునెలల నుంచి జిల్లాలోని మునిసిపాలిటీల ప్రణాళిక విభాగానికి భవనం నిర్మించుకునేందుకు ఒక్క ప్లాన్ రాలేదు. ఒకరిద్దరు భవన యజమానులు ముందుకొచ్చినా ఎల్‌టీపీలు బాయ్‌కాట్ చేశారు. నిబంధనలు సరళించాలని మునిసిపల్ మంత్రి నారాయణకు మొరపెట్టుకున్నా ఫలితంలేదు. దీంతో గత మూడు నెలలుగా జిల్లాలో ఆదాయానికి గండి పడింది. ప్రతీనెల జిల్లాలో వంద నుంచి 200 భవనాల నిర్మాణానికి కొత్తప్లాన్‌లు వచ్చేవి. వీటి ద్వారా నెలకు వచ్చే సుమారు రూ.రెండు కోట్ల ఆదాయాన్ని మునిసిపాలిటీలు కోల్పోయాయి. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం జీవో 20ని సవరించి భవన నిర్మాణాలకు ప్లాన్స్ అప్రూవల్ చేసే పనిని సులభతరం చేయాలని భవన నిర్మాణ యజమానులు, ఎల్‌టీపీలు, కార్మికులు కోరుతున్నారు.

భవన నిర్మాణాలకు ముందుకు రండి..

ప్రజా ప్రయోజనాల దృష్ట్యానే ప్రభుత్వం జీవో నంబరు 20ని తీసుకొచ్చింది. భవన నిర్మాణ యజమానులు, ఎల్‌టీపీలు ఆందోళన చెందాల్సిన పని లేదు. కొత్తజీవో ప్రకారం నగరపాలక సంస్థ అధికారాలను ఎల్‌టీపీలకు కట్టబెట్టింది. భవనాలు నిర్మించుకునేందుకు యజమానులు, ప్లాన్‌లు ఇచ్చేందుకు ఎల్‌టీపీలు ముందుకురావాలి.

- ఎ.భానుప్రతాప్, నగరపాలక సంస్థ కమిషనర్

జీవో 20లో సవరణలు చేయండి

స్వీయసర్టిఫికేషన్ టీమ్ 2025 జీవో నంబరు 20 తీసుకొచ్చిన ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తున్నాం. అయితే ఎల్‌టీపీల భయాందోళనలను తొలగించాలి. స్థల యజమాని భవనాన్ని సరిగా నిర్మించకపోయినా, తప్పుడు సమాచారం ఇచ్చి ప్లాన్ అప్రూవల్ చేయించుకున్నా ఎల్‌టీపీలను బాధ్యులను చేయడం సమంజసం కాదు. లైసెన్స్‌లు రద్దు, కేసులు పెడతామనడం దారుణం. జీవోను సవరించి మున్సిపల్ అధికారులకే పర్యవేక్షణ అధికారం ఇవ్వాలి. కొత్త జీవో వల్ల మూడునెలలుగా ఎల్‌టీపీలమంతా ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డాం.

- డి.బాలాజీ, ఏలూరు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు, జి.శ్రీనివాసన్, సెక్రటరీ



భీమవరం ర్యాలీలో సైనిక దుస్తుల్లో డిప్యూటీ స్పీకర్ రఘురామ, వీరజవాన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

సైన్యానికి సంపూర్ణ మద్దతు

- డిప్యూటీ స్పీకర్ రఘురామ.. భీమవరంలో సమైక్యతా ర్యాలీ

భీమవరం టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి):'భారత సైన్యానికి మనమంతా సంపూర్ణ మద్దతు ప్రకటిద్దాం. యుద్ధం ముఖ్యం కాదు. ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే లక్ష్యం కావాలి' అని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు పిలుపునిచ్చారు. శనివారం జువ్వలపాలెం రోడ్డులోని అడ్డవంతెన వద్ద వున్న మాజీ మంత్రి చింతలపాటి మూర్తిరాజు విగ్రహం నుంచి పెద అమిరం దగ్గరలోని టాటా విగ్రహం వరకు సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ప్రధానమంత్రికి, భారత సైన్యానికి మనమంతా సంపూర్ణ మద్దతు ఇవ్వాలి. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించారు. యావత్ ప్రపంచం మనకు మద్దతుగా నిలిచింది. మనకు యుద్ధం కాదు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించడమే ముఖ్యం. భారత సైన్యానికి మనోధైర్యం కల్పించడానికి భీమవరం, ఉండి నియోజకవర్గాల స్థాయిలో సమైక్యత ర్యాలీ నిర్వహిస్తున్నాం' అని తెలిపారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ భారతదేశంపై ఎటువంటి దాడులు జరిగిన ఉపేక్షించేది లేదన్నారు. పీఏసీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నో రకాలుగా ఇబ్బంది పెడుతున్న పాకిస్థాన్ తీవ్రవాదాన్ని అంతమొందించేందుకు ప్రధాని మోదీకి మద్దతు ఇవ్వాలన్నారు. వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో ఏఎస్పీ భీమారావు, వివిధ శాఖల అధికారులు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు

తగ్గిన గుడ్ల ఉత్పత్తి.. బర్డ్‌ఫ్లూ నుంచి తేరుకోని పౌల్ట్రీ పరిశ్రమలు

లోపలి పేజీలో..

నీటి దొంగలు!



దోసపాడు కాల్వ నుంచి వైసీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు, నరసాపురం మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు చెరువుకు తూముల ద్వారా నీటి తరలింపు

ఇసుక, మట్టి, భూములే కాదు.. నీటిని కూడా దోచేసుకుంటున్నారు వైసీపీ నాయకులు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఏ మాత్రం భయం లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. పంచాయతీల్లోని చెరువులను నింపేందుకు ప్రభుత్వం మంచినీటిని వదిలితే.. ఆ నీటితో తమ చేపల చెరువులను నింపుకొంటున్న వైసీపీ నాయకుల బండారం కృష్ణా జిల్లా నందివాడ మండలంలో బయటపడింది. ఆ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు, నర్సాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు పాలేటి చంటి.. కాల్వల నుంచి నేరుగా చెరువుల్లోకి తూములను ఏర్పాటు చేసుకుని, మోటార్లను పెట్టుకుని నీటిచౌర్యానికి పాల్పడుతున్నారు.

- కృష్ణా జిల్లా దోసపాడు కాల్వలో వైసీపీ నాయకుల నీటి దోపిడీ
- తాగునీటి చెరువులు నింపేందుకు ప్రభుత్వం నీటి విడుదల
- ఈ నీటిని తమ చేపల చెరువులకు మళ్లిస్తున్న నరసాపురం మాజీ ఎమ్మెల్యే ప్రసాదరాజు

(గుడివాడ-ఆంధ్రజ్యోతి)

నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుకు పెదవిరివాడ సెంటర్‌లో కుదరవల్లి ఆయకట్టు వద్ద సుమారు 160 ఎకరాల్లో రెండు చేపల చెరువులున్నాయి. ఇటీవల చేపలను పట్టుబడి చేసి చెరువులను ఎండగట్టారు. వీటిలో 80 ఎకరాల చెరువుకు బుడమేరు నుంచి మోటార్ల సహాయంతో నీటిని నింపారు. ఈ నేపథ్యంలో కృష్ణా జిల్లా నందివాడ మండలంలోని పంచాయతీ చెరువులను తాగునీటి అవసరాల నిమిత్తం నింపేందుకు దోసపాడు కాల్వకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20న మంచినీటిని వదిలింది. ఈ కాల్వ నుంచి నేరుగా తూములను ఏర్పాటు చేసి మరో 80 ఎకరాల చెరువును నింపేందుకు నీటిచౌర్యానికి పాల్పడు తున్నారు. కాల్వలో నీరు పుష్కలంగా ఉంటే గ్రావిటీ ద్వారా తూముల నుంచి చెరువుల్లోకి మళ్లిస్తున్నారు. నీరు కొంచెం తగ్గడంతో 10 మోటార్లను పెట్టి పగలు, రాత్రి తేడా లేకుండా లాగేస్తున్నారు.

కొడాలి ముఖ్య అనుచరుడి నీటిచౌర్యం

మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు పాలేటి చంటికి తుమ్మలపల్లి ఆయకట్టులో 30 ఎకరాల చేపల చెరువు ఉంది. ఇటీవల చేపల పట్టుబడి చేసి చెరువులను ఎండగట్టారు. ఆ చెరువుకు దోసపాడు కాల్వ నుంచి మూడు తూములను ఏర్పాటు చేసుకున్నారు. తూముల ద్వారా కొంతమేర చెరువును నింపి, మిగిలిన భాగాన్ని ఆరు మోటార్ల సాయంతో నింపేసుకున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా నీటిచౌర్యం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు.

నందివాడ డ్రాప్ వరకు ఫుల్

దోసపాడు కాల్వలో నందివాడ డ్రాప్ వరకు నీరు పుష్కలంగా ఉంటుంది. కట్టలు తెగే స్థాయిలో ఇక్కడ నీటి నిల్వలు ఉంటాయి. అయితే, రామాపురం సెంటర్‌కు వచ్చేసరికి కాల్వలో అడుగు లోతు నీరు కనిపించదు. నీటిచౌర్యం వల్లే ఈ పరిస్థితి వస్తోందని పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరిగేషన్ అధికారుల డ్రామా

పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమార్కులు మంచినీటిని దోచేస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవట్లేదు. అనుమతులు లేకుండా కాల్వల నుంచి తూములను ఏర్పాటు చేసుకున్నా చర్యలు తీసుకోవట్లేదు. ఎవరైనా పర్యవేక్షణకు వస్తున్నారని తెలిస్తే ఆ పూటకు చేపల చెరువుల వారితో తూములను కట్టించడం, మోటార్లను నిలుపుదల చేయడం చేస్తున్నారు. ఈ వారంలో నీటి సరఫరా నిలుపుదల చేయనున్న నేపథ్యంలో పంచాయతీ చెరువులు ఏ స్థాయి వరకు నిండుతాయో వేచి చూడాలి. కాగా, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కాల్వ ద్వారా నీటి తరలింపును పరిశీలించేందుకు వస్తున్నారనే సమాచారంతో రెండు రోజుల క్రితం ఇరిగేషన్ అధికారులు పాలేటి చంటి చెరువుపై ఉన్న మోటార్లను నిలుపుదల చేయించారు.

నీటిని అమ్మేసుకుంటున్నారు

నందివాడ వరకు కాల్వలో భారీస్థాయిలో నీరు ఉంది. రామాపురానికి వచ్చేసరికి అడుగు లోతు ఉండట్లేదు. కాల్వలో నీరు పుష్కలంగా వచ్చిన నాడే పంచాయతీ చెరువులను నింపుతా. మోటార్లు పెట్టి నీటిని తోడితే పంచాయతీపై అదనపు భారం పడుతుంది. చేపల చెరువులకు కాల్వ నీటిని ఇరిగేషన్ అధికారులే అమ్మేసుకుంటున్నారు.

చూద్దాంలే..!

- ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు అంతంతే
- మూడు నెలలు గడిచినా 195 మందే ముందుకు..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) :

పల్లెలు,పట్టణాల్లో ఆక్రమణలు వేసుకుని నివాసం ఉంటున్న వారి ప్లాట్లు, ఇళ్ల క్రమబద్ధీకరణ ఉచితంగా చేసుకునేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఇది జరిగి మూడు నెలలవుతున్నా ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేవారే కరువయ్యారు. దీంతో దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్పందన కరువైంది. ఫిబ్రవరి మొదటివారంలో జీవో నెంబరు 30ను వెలువరించగా.. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 195 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు గడువు ఉంది. ఈలోగా గ్రామ, గ్రామాన పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా జిల్లాలో ఆ ఊసే లేదు. తహసీల్దార్, మునిసి పల్, ఇతర ముఖ్య కార్యాలయాల వద్ద కనీసం బ్యానర్ లేదా పోస్టర్ వంటివి దర్శనమివ్వడం లేదు. 150 గజాల లోపు భూముల్లో ఆక్రమణలు వేసుకుని నివసిస్తున్న పేద వర్గా లపై టీడీపీ ప్రభుత్వం కనికరం చూపింది. ఉచితంగా క్రమబద్ధీ కరించేందుకు పచ్చజెండా ఊపిం ది. అదీ కూడా 150 గజాల లోపు స్థలాలను క్రమబద్ధీకరించి మహి ళల పేరిట పట్టాలను జారీ చేయా లని జీవోలో పేర్కొన్నారు. 2019 అక్టోబరు 15 ముందు జరిగిన ఆక్ర మణలను సంబంధించిన దరఖాస్తులనే పరిశీలిస్తారు. దరఖాస్తు దారులు రుజువు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. భూముల క్రమబద్ధీకరణకు గ్రామాల్లో గరిష్ఠంగా నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.14 వేల లోపు ఆదాయం ఉన్న లబ్ధిదారులను అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. విద్యుత్ బిల్లుల చెల్లింపు రూ.300 మించి ఉండకూడదు. మెట్ట, మాగాణి కింద 10 ఎకరాలకు మించకూడదు. ఆర్‌సీసీ రూఫ్, ఆస్ బెస్టాస్ రూఫ్‌తో కట్టిన నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. లబ్ధిదారులు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన తర్వాత రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తారు.

- జిల్లాలో మొత్తం 195 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో జంగారెడ్డిగూడెం నుంచి అత్యధికంగా 152 రాగా, ద్వారకా తిరుమల 21, పోలవరం నుంచి 11, నూజివీడు నుంచి ఏడు, నిడమర్రు, భీమడోలు నుంచి ఒక్కొక్క దరఖాస్తు అందాయి. ఏలూరు, దెందులూరు, చింతల పూడి, పోలవరం ముంపు మండలాల నుంచి ఒకటి రాలేదు.

పోలవరం అఖండ గోదావరి గట్టు దగ్గర నుంచి నర్సాపురం వశిష్ట గోదావరి సముద్రంలో సంగమం అయ్యే ప్రాంతం 130 కిలోమీటర్ల నిడివిన ఏటిగట్టు నిర్వహణ ఎలా ఉందో పరిశీలించినప్పుడు చాలా చోట్ల నిర్లక్ష్యమే కనిపించింది. రానున్నది వర్షాకాలం... ఆ లోపు ఏటిగట్టు ఎక్కడెక్కడ బలహీనంగా ఉన్నాయి.. నిర్వహణా లోపాలు బహిర్గతం చేసేందుకు, అధికారులను అప్రమత్తం చేసే దిశగా 'ఆంధ్రజ్యోతి' బృందం శనివారం ఏటిగట్టుపై ప్రయాణించింది... లోపాలను గుర్తించింది.. గోదావరి పరీవాహక ఏటిగట్ల పరిస్థితిపై పరిశీలన.

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఏటి గట్టు?



ఇసుక వాహనాలతోనే ఇబ్బంది

పోలవరం మండలంలో ఏటిగట్టుకి పొడవునా పలుచోట్ల కొందరు స్థానికులు తమ అవసరాల కోసం గట్టుకి గండ్లు కొట్టడం వల్ల గట్టు బలహీనంగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి. పోలవరం, కృష్ణారావుపేట, బంగారమ్మపేట,పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల, మహాలక్ష్మిదేవిపేట గ్రామాల పరిధిలో సుమారు పది కిలోమీటర్ల పొడవునా పలుచోట్ల ఏటిగట్టు బలహీనంగా తయారయ్యాయి. కృష్ణారావుపేట, బంగారమ్మపేట గ్రామాల వద్ద ప్రైవేటు రిసార్టులు, అతిథి గృహాలు, కల్యాణ మండపాల నిర్వహణ కోసం తవ్వి ఏర్పాటు చేసిన మార్గాలు సైతం ప్రమాదకరంగా ఉన్నాయి. ఇసుక ర్యాంపుల నిర్వహణ కోసం పట్టిసీమ గూటాల మధ్య, గూటాల తాడిపూడి గ్రామాల మధ్య తవ్విన గండ్లు పూడ్చకపోవడం వల్ల వరదల సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-పోలవరం (ఆంధ్రజ్యోతి)



కొవ్వూరు మండలం ఆరికిరేవుల వద్ద జారిన ఏటిగట్టు మార్జిన్

భారీ వాహనాల రాకపోకలతో ఆందోళన

కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలం తాడిపూడి నుంచి కొవ్వూరు మండలం సీతంపేట వరకు గోదావరి ఏటిగట్టు 30 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. వైసీపీ ప్రభుత్వంలో గడిచిన ఐదేళ్ల ఏటిగట్టుకు తూట్లు పొడుస్తూ సుమారు 5 అడుగులకు పైబడి గట్టు తవ్వేసి ఇసుకర్యాంపులు ఏర్పాటు చేయడంతో వరదల సమయంలో ఏటిగట్టు ఎక్కడ తెగిపడి గోదావరి ఊళ్లల్లోకి ప్రవహిస్తుందోనని తీర ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు.గోదావరి నదీ ఏటిగట్టు దిగువన భారీ వాహనాలకు అనుమతి లేదు. అయినప్పటికీ 40, 50 టన్నులకు మించిన భారీ ఇసుక లారీలు రాకపోకలు సాగించడంతో ఏ క్షణాన ఏమవుతుందోనని అధికారులు, ఇటు తీర ప్రాంత ప్రజలు కంటిమీద కునుకులేకుండా బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల వద్ద గోదావరి నది ఏటిగట్టు మార్జిన్ సుమారు 100 మీటర్ల పొడవునా రెండు మీటర్లు కిందకు జారింది. దీనిని పటిష్ట పరచడానికి రూ. 12 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఏజీఆర్బీ ఏఈ మణికంఠరాజు తెలిపారు.

-కొవ్వూరు (ఆంధ్రజ్యోతి)



తాళ్లపూడి వద్ద ఇసుక ర్యాంప్ కోసం గోదావరి గట్టుకు కోత

వర్షాకాలంలో పెను ప్రమాదం

తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాల పరిధిలో గోదావరి గట్టు వెంబడి ఎక్కడ పడితే అక్కడ గోదావరి గట్టుకు తూట్లు పెట్టి ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. బల్లిపాడు గ్రామం నుంచి తాడిపూడి గ్రామం వరకూ గల గోదావరి ఏటిగట్టు వెంబడి ఎవరికి వారు ఇసుక కోసం ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. రానున్న వర్షాకాలంలో గోదావరి వరదల సమయంలో ఈ ర్యాంపుల వల్ల పెను ప్రమాదం పొంచి ఉంది. ఏమాత్రం ఏమరుపాటు వహించినా గట్టుకు గండ్లు పడి గ్రామాలకు గ్రామాలు మునిగిపోయే ప్రమాదముంది.

-తాళ్లపూడి (ఆంధ్రజ్యోతి)



నిడదవోలు మండలం పెండ్యాల వద్ద ఎడమ వైపు కుంగుతోన్న గోదావరి ఏటిగట్టు

ఇసుక లారీల రాకపోకలతో అస్తవ్యస్తం

గోదావరి వరద నీరు పరివాహక ప్రాంతాల్లోకి రాకుండా ఉండేందుకు విజ్జేశ్వరం నుంచి పెండ్యాల శివారు వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర గోదావరి గట్టును పటిష్ట పరిచారు. ఇది జరిగి సుమారు 15 ఏళ్ళు పైనే అవుతున్నా గోదావరి ఏటిగట్టు నిర్వహణా లోపం కారణంగా ఏటిగట్టు కోతకు గురవుతూ వస్తుంది. మరో పక్క నిడదవోలు మండలం పెండ్యాల పందలపర్రు ఇసుక ర్యాంపుల నుంచి రాత్రి సమయాల్లో ఇసుక లారీలు ఇసుక అక్రమ రవాణాను ఏటిగట్టు ద్వారా సాగించడంతో ఏటిగట్టు ధ్వసంమవుతోంది.

- నిడదవోలు (ఆంధ్రజ్యోతి)

అడుగడుగునా గోతులు..కోతలు

వర్షాకాలం దగ్గర పడుతున్నవేళ గోదావరి నదీ తీరాన గ్రామాల్లో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు లోనవుతున్నారు.కానూరు నుంచి మల్లేశ్వరం వరకు దాదాపు 20 కిలోమీటర్లు మేర విస్తరించిన గోదావరి ఏటిగట్టు అధ్వానంగా తయారైంది. ఈ పొడవునా సుమారు 10కు పైగా గ్రామాలు ఉన్నా ఏటిగట్టుపై కనీస సంరక్షణ చర్యలు కనిపించడం లేదు. ప్రతీ కిలోమీటరుకు పది వరకు చోట్ల గుంతలు, కోతలు ఏర్పడిన తీరు భయం కలిగిస్తుంది. గతంలో ఈ గట్టుపై కార్లు, బైకులు, సులభంగా నడిచేవి. ఇపుడు రాళ్ళు లేచి భారీ గోతులు ఏర్పడి వాహనాలకు అడ్డంకులుగా ఏర్పడ్డాయి. ఏటిగట్టు పొడవునా పలుచోట్ల గట్టు పటుత్వం పూర్తిగా దెబ్బతిన్నది. గత ప్రభుత్వ హయాంలో గోదావరి ర్యాంప్‌ల వద్ద విస్తృతంగా ఇసుక మట్టిని అక్రమంగా తరలించడం వల్ల గట్ల బలం పూర్తిగా తగ్గిపోయింది. తీపర్రు కాకరపర్రు, కానూరు, ఉసులుమర్రు, కాకరపర్రు-ముక్కామల మార్గాల్లో గట్టు జారిపోవడం, గుంతలు, రాళ్ల లేచిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

-పెరవలి (ఆంధ్రజ్యోతి)



గోదావరి గట్టుపై విచ్చలవిడిగా తిరుగుతున్న లారీలు

గోదావరి గట్టుపై 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలన

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వరద సమయంలో గత అనుభవాలను పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించలేదు. గతంలో గోదావరి ఉగ్రరూపం దాల్చినప్పుడు పరివాహకంలో ఉన్న గ్రామాలు విలవిలలాడాయి. ఏ క్షణాన నదికి గండి పడుతుందని కంటిమీద కునుకు లేకుండా గడిపాయి. 2004 నుంచి 2025 వరకు అధికారంలో ఉన్న ప్రభుత్వాల్లో ఒక్క తెలుగుదేశం ప్రభుత్వం కాస్తో కూస్తో గోదావరి గట్టు పటిష్టతపై కొంత శ్రద్ధ పెట్టింది. ఈ మేరకు ఎక్కడ బలహీనంగా ఉంటే అక్కడ ముందస్తు చర్యలు తీసుకున్నారు.గోదావరి కట్ట బలహీనపడకుండా, కోతకు గురికాకుండా గ్రోయిన్స్ ఏర్పాటు చేశారు. ప్రవాహ ఒరవడిని ఆ మేరకు కట్టడి చేయగలిగారు.

- పోలవరం మండలం ప్రాంతంలో గోదావరి ఉధృతంగా ప్రవహించినా ఏమాత్రం ఢోకా లేకుండా ఇప్పటికీ ఏటిగట్టు పటిష్టంగానే ఉంది. ఇసుక ర్యాంపులకు వెళ్లే మార్గాల్లో వాహనాలు రాకపోకలు కారణంగా అనేకచోట్ల గట్టుకు నష్టం జరిగింది.

అక్కడక్కడ నిర్వహణా లోపాలు
ఇసుక ర్యాంపుల కారణంగా కొన్నిచోట్ల బీటలు
మరికొన్ని చోట్ల కుంగిన గట్టు
దీర్ఘకాలంగా మరమ్మతులు ఏవీ ?
జగన్ జమానాలో వదిలేశారు
రానున్నది వరదల కాలం
కూటమి ప్రభుత్వం చేయాల్సింది చాలా ఉంది..

- కొవ్వూరు ప్రాంతంలోనూ ఈ తరహా పరిస్థితులే ఉన్నాయి. ఆదినుంచి గోదావరి ఇసుక తరలింపునకు వీలుగా ర్యాంపులు నిర్మించినప్పుడు యధావిధిగా గట్టుకు ఇబ్బంది ఏర్పడుతోంది. అయితే గట్టుకు గండి పడేటంత ఇబ్బంది ఇప్పటి దాకా ఎదురుకాలేదు. అయినా అధికారులు ఈ తరహా పరిస్థితిపై చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. గోదావరి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్నప్పుడు మాత్రం గట్టు వెంబడే పహారాతో సరిపెడుతున్నారు.
- తాళ్లపూడి మండల పరిధిలో చింతలపూడి ఎత్తిపోతల, తాడిపూడి ఎత్తిపోతల హెడ్‌వర్క్స్ ఉన్నాయి. నిడదవోలు మండల పరిధిలో విజ్జేశ్వరం దగ్గర నుంచి అఖండ గోదావరి ముందుకు సాగుతూనే ఉంది. అక్కడక్కడ గట్టుకు నిర్వహణ లోపాలు బట్టబయలవుతున్నాయి. ప్రత్యక్షంగా గమనిస్తే తప్ప ఇవేవి బహిర్గతం కావు.
- పెరవలి మండల పరిధిలోను గోదావరి ప్రవాహ వేగం అత్యధికంగా ఉండటంతో అక్కడక్కడ ఇంతకుముందే గ్రోయిన్స్ ఏర్పాటు చేశారు. అయితే అవి ఇప్పటికే బలహీన పడ్డాయి. సిద్ధాంతం దగ్గర నుంచి నర్సాపురం వరకు వశిష్ట గోదావరి గట్టు పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉంది.
- పెనుగొండ మండలం పరిధిలో అక్కడక్కడ గోదావరి గట్టు మీద ఉన్న చెట్లన్నీ ఏటిలోపలికి ఒరిగి కనిపిస్తున్నాయి. ఆచంట దగ్గర నుంచి మిగతా మండలాల పరిధిలోని గట్టు మాత్రం అక్కడక్కడ నీటి వాలుకు గురైంది. దీన్ని నివారించేందుకు ప్రతీ వానాకాలంలోను ఇసుక బస్తాలను ఆ వాలుకు అడ్డుగా పెట్టి గట్టు కొట్టుకునిపోకుండా జాగ్రత్త పడుతున్నారు. శాశ్వత చర్యలకు ఏనాడు అధికారులు ప్రయత్నించలేదు. ఇదంతా సర్వసాధారణంగానే తీసుకుంటారు.
- యలమంచిలి మండలంలో ప్రతీ ఏటా గోదావరి వరదలకు నష్టం వాటిల్లుతూనే ఉంది. ఈ మండలంలోనే 21 కిలోమీటర్ల మేర విస్తీర్ణంలో గోదావరి గట్టు ఉంది. 2022లో వరదలు రావడంతో పాటు సాధారణ ప్రవాహానికి మించి వరద ముంచెత్తడంతో అనేక గ్రామాలు మునిగిపోయాయి. రోజుల తరబడి జనం నడుం లోతు నీటిలో ఉండిపోయారు. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు నియోజకవర్గంలో ఈ ప్రాంతం ఉంది. దాదాపు 8 కోట్ల వ్యయంతో ఏటిగట్టు పటిష్టం చేసే పనులకు నిమ్మల ఈ మధ్యనే శ్రీకారం చుట్టారు. కనీసం వచ్చే వర్షాకాలం సమయంలోనైనా వరదల నుంచి యలమంచిలి వాసులను రక్షించేందుకు నడుంకట్టారు.
- నర్సాపురం, యలమంచిలి మండలాల్లో మాత్రం మరో విచిత్ర పరిస్థితి. నర్సాపురం ఒడ్డున దాదాపు 400 మీటర్ల మేర జగన్ ప్రభుత్వ హయాంలో వశిష్ట గట్టు కాస్తా భారీ కుంగింది. ఇదిగో అదిగో అంటూ అప్పట్లో హడావుడి చేసి 200 మీటర్ల పనులు చేసి, మిగతా 200 మీటర్ల పనిని గాలికొదిలేశారు. తిరిగి వరదలొస్తే నర్సాపురానికి ముప్పే. రాజుల్లంక నుంచి బియ్యపుతిప్ప వరకు ఏటిగట్టు ఎత్తు ప్రతిపాదన ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం విచిత్రం.



నక్కావారిపాలెం సమీపంలో కోతకు గురైన ఏటిగట్టు

ఎక్కడికక్కడ గట్లు ధ్వంసం

గత వైసీపీ ప్రభుత్వం ఏటిగట్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఎక్కడా నిర్వహణ పనులు చేపట్టలేదు మండలంలోని దొంగరావిలెం నుంచి నడిపూడి వరకు పలుచోట్ల ఏటిగట్టు అధ్వానంగా తయారైంది. గతంలో గట్టు వెంబడి కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్ళు ప్రయాణించేవి. గత ఐదేళ్లలో అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలతో లారీల, ట్రాక్టర్‌లు విచ్చలవిడిగా తిరగడంతో ఎక్కడికక్కడ గట్లు ధ్వంసం అయ్యాయి. ప్రస్తుతం గట్టు పొడవునా పచ్చగడ్డి, తుప్పలు పెరిగిపోయి ఉండటంతో గట్టు ఎక్కడ ఏ విధంగా ఉందో అంచనా వేయలేని పరిస్థితి. ప్రస్తుతం సుమారు 15 కిలోమీటర్లు ఉన్న ఏటిగట్టుకు అక్కడక్కడ నెర్రలు ఏర్పడ్డాయి. నక్కావారిపాలెం సమీపంలో గోదావరి వైపు గట్టు కొంత భాగం కోతకు గురవడంతో అటుగా వెళ్లేవారు భయాందోళనకు గురవుతున్నారు.

-పెనుగొండ (ఆంధ్రజ్యోతి)



నరసాపురంలో అసంపూర్తిగా వదిలేసిన ఏటిగట్టు పనులు

వరదలొస్తే లంకగ్రామాలు బిక్కు..బిక్కు



యలమంచిలి-చించినాడ గ్రామాల మధ్య ఇటీవల ఎత్తుపెంచిన ఏటిగట్టు

యలమంచిలి మండల పరిధిలో కంచుస్తంభం పాలెం, బూరుగుపల్లి, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక గ్రామాలను ఆనుకుని సుమారు 21 కిలోమీటర్ల మేర ఏటిగట్టు విస్తరించి ఉంది. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏటిగట్టు పటిష్టతకు పనులు ప్రారంభించి దాదాపు 2011లో పనులు ముగించారు. మండలంలోని పలుప్రాంతాల్లో ఏటిగట్టు ఎత్తు పెంచకుండా వదిలేశారు. గోదావరికి భారీగా వరదలు వచ్చినపుడు ఏటిగట్టు ఎత్తుపెంచకుండా వదిలేసిన ప్రాంతాల్లో ఏటిగట్టుకు వెలుపల ఉన్న గ్రామాల ప్రజలు బిక్కు బిక్కుమంటూ కాలం గడిపాల్సిన పరిస్థితి. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022లో గోదావరికి భారీగా వరద రావడంతో వాకలగరువు, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం, యల మంచిలి, చించినాడ ప్రాంతాల్లో చాలాచోట్ల వరదనీరు ఏటిగట్టుకుపైకి ప్రమాదకర స్థాయిలో వరదనీరు ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, ఏటిగట్టుపై ఇసుక బస్తాలతో అడ్డుకట్టలు వేసుకున్నారు. వరద తీవ్రత ఉన్నన్ని రోజులూ ఆయా గ్రామాల ప్రజలు ఏటిగట్టు వెంబడి రాత్రనక, పగలనక పహారా కాసుకుని గ్రామాలు వరద ముంపుబారిన పడకుండా ప్రజలే రక్షించుకున్నారు.కూటమి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ప్రత్యేక చొరవ చూపించి ఏటిగట్టును పటిష్టం చేసే పనులకు శ్రీకారం చుట్టారు. వాకల గరువు, దొడ్డిపట్ల ప్రాంతంలో సుమారు 700 మీటర్ల మేర, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం ప్రాంతాల్లో సుమారు 1800 మీటర్లు, యలమంచిలి, చించినాడ గ్రామాల మధ్య 1000 మీటర్లు ఏటిగట్టు పటిష్టత పనులను సుమారు రూ.6.1 కోట్ల నిధులతో చేపట్టారు. వాకలగరువు, దొడ్డిపట్ల, యలమంచిలి, చించినాడ ప్రాంతాల్లో పనులు దాదాపు పూర్తయ్యాయి. అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం ప్రాంతాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి.

- యలమంచిలి (ఆంధ్రజ్యోతి)

ప్రతిపాదనలతోనే సరి

నరసాపురం మూడేళ్ల క్రితం పట్టణంలోని అమరేశ్వరస్వామి ఆలయం నుంచి బుడితల రేవు వరకు ఏటిగట్టు కొట్టుకుపోయింది. 2023లో దాదాపు రూ.23 కోట్లుతో గట్టు పటిష్ట పనులు చేపట్టారు. ఈ పనులు అసంపూర్తిగానే మిగిలాయి. పలుసార్లు నీటి ప్రవాహానికి గట్టు జారిపోయింది. ఆ తరువాత గట్టు పటిష్ట చేసినప్పటికీ చివరి దశ వరకు పనులు సాగలేదు. ఇంకా 70 మీటర్ల మేర చేపట్టాల్సి ఉంది. రాజుల్లంక, బియ్యపుతిప్ప వద్ద ఏటిగట్టు ఎత్తు పనులు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఈస్ట్ కుక్కులేరు, ధర్భరేవు స్లూయిస్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వీటి రిపేర్లకు ప్రతిపాదనలే తప్ప నిధులు మంజూరు కావడం లేదు. ఇరవై ఏళ్లుగా గట్టు నిర్వహణ పనులకు నిధులు కూడా కేటాయించలేదు. ఈ కారణంగా చాలా చోట్ల ఏటిగట్టు కుధించింది. కొన్ని చోట్ల నదిప్రవాహంతో గట్టు కోతకు గురి కాకుండా ప్రతిపాధించిన గ్రోయిన్స్ పనులు కూడా చేపట్టలేదు.

-నరసాపురం (ఆంధ్రజ్యోతి)



ఆచంట మండలం కోడేరు- పెదమల్లం మధ్యలో పిచ్చిమొక్కలతో నిండిన ఏటిగట్టు

అక్కడక్కడ నెర్రలు..

వశిష్ట గోదావరి ఏటిగట్టు పరిస్థితి అధికారులకు వరదల సమయంలోనే గుర్తుకు వస్తుంది. ఆ సమయంలోనే పరుగులు తీస్తారు. గత సంవత్సరం గోదావరి పలుమార్లు వరదలు రావడంతో అటు అధికారులు, ఇటు ప్రజలను కూడా భయపెట్టింది. ప్రస్తుతం ఏటిగట్టు అక్కడక్కడ నెరలు తీసి చాలా చోట్ల పిచ్చిమొక్కలతోనే నిండి ఉంది. కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్ళడానికి వీలులేకుండా ఉంది. సుమారు 18 సంవత్సరాలు క్రితం అప్పటి ప్రభుత్వం గోదావరి ఏటిగట్టును పటిష్ఠపరిచి గ్రావెల్ రోడ్డు కూడా వేశారు. దొడ్డిపట్ల నుంచి సిద్ధాంతం వరకు కూడా అనేక వాహనాలు నిరంతరం తిరుగుతూ ఉండేవి. ప్రస్తుతం ఏటిగట్టు పరిస్థితి అలా లేదు. అధికారులు స్పందించి గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకుని నెర్రలు ఉన్న చోట పటిష్ట పరిచి పిచ్చిమొక్కలు తొలగించి కనీసం గ్రావెల్‌రోడ్డు వేయాలని గోదావరి తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఏటిగట్టు ఎక్కడా బలహీనంగా లేదని సిద్ధాంతం నుంచి భీమలాపురం వరకు కొన్ని చోట్ల గ్రావెల్ రోడ్డు పటిష్ట పరిచేందుకు సుమారు రూ. 2 కోట్లు ప్రతిపాదనలు పంపించినట్టు హెడ్‌వర్క్స్ ఏఈ పవన్ కుమార్ తెలిపారు. నిధులు మంజూరు కాగానే ఏటిగట్టును అభివృద్ధి చేస్తామన్నారు.

-ఆచంట (ఆంధ్రజ్యోతి)



ఆచంట వేమవరంలో ఉన్న సీతమ్మ బావి

ఈ బావికి 200 ఏళ్లు

వందల సంవత్సరాల నాటి బావిలు (నుయ్యిలు) శిథిలావస్థకు చేరి ప్రస్తుతం నిరూపయోగంగా మారాయి. ప్రస్తుత జీవన విధానంతో పాటు భూగర్భజలాల్లో మార్పులు కారణంగా బావినీళ్లను వినియోగించేవారు కరువయ్యారు. ఫిల్టర్ చేసిన తాగు నీరు నిత్యం అందరికి అందుబాటులోకి రావడం ఇంటి వద్దకే వచ్చి విక్రయించడం వంటి కారణాలతో బావుల నీళ్ల వినియోగించేవారు తగ్గిపోయారు. పూర్వం చెరువులు ఉన్నప్పటికి మంచి నీటి కోసం గ్రామంలో ఒకచోట పెద్ద నుయ్యి ఏర్పాటు చేసి బండరాళ్ళతో చుట్టు రక్షణ గోడలను కట్టేవారు. గ్రామస్థులంతా నుయ్యిలోని నీటినే తాగునీటిగా ఉపయోగించేవారు. ఊరందరికీ ఇటువంటి బావులు ఎంతగానే ఉపయోగపడేవి..అలాంటి బావులు చూద్దామన్నా ప్రస్తుతం అక్కడక్కడ మాత్రమే కనిపిస్తుంటాయి. మండలంలో ఆచంట వేమవరం పంచాయతీ వద్ద ఉన్న సీతమ్మ నుయ్యి 1822లో గ్రామంలో ఏర్పాటు చేయగా ఈ భావికి 203 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రస్తుతం ఈ నుయ్యి పూర్తిగా పాడైపోయింది. అయితే 2018లో గ్రామానికి చెందిన వరదా చార్యులు, సత్యకుమారి కుటుంబ సభ్యులు ఈ నుయ్యిని పునర్ నిర్మాణం చేపట్టారు. నుయ్యిలను శుభ్రం చేసి కాపాడుకుంటే గ్రామంలో తాగునీటి కొరత ఉండదని పలువురు భావిస్తున్నారు. చాలా గ్రామాల్లో ఉన్న నుయ్యిలు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. ఏళ్లనాటి భావులను శుభ్రం చేసుకుని కాపాడుకుంటే తాగునీటి సమస్య ఉండదని పలువురు అంటున్నారు. అలాగే నూతిలోని నీళ్ల తాగితే ఎటువంటి అనారోగ్యాలు రావని పలువురు చెబుతున్నారు.

- ఆచంట (ఆంధ్రజ్యోతి)

పవన్ హామీల అమలుకు అడుగులు

మొగల్తూరు ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులకు ఏర్పాట్లు

మొగల్తూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామస్థులకు ఇచ్చిన భరోసా నెరవేరుతోంది. పవన్ కల్యాణ్ కుటుంబ మూలాలున్న జిల్లాలోని మొగల్తూరు, పెనుగొండ గ్రామాల్లో నూరుశాతం సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తూ అధికారులను స్థానిక ప్రతినిధులను పరుగులు పెట్టిస్తు న్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌చే నేరుగా మొగల్తూరు గ్రామాభివృద్ధిపై మొగల్తూరులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో గ్రామస్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. వచ్చిన వినతుల్లో విద్యకు ప్రాధాన్యం ఇస్తూ సమీక్షా సమావేశం నిర్వహించిన మరుసటి రోజునే రాష్ట్ర మానవ వనరుల శాఖమంత్రి నారా లోకేష్ ద్వారా మొగల్తూరు ఉన్నత పాఠశాలలో చేపట్టిన అసంపూర్తి, చేయాల్సిన అభివృద్ధి పనులకు రూ. కోటి 71 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే అభివృద్ధి పనులు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. దీనిలో భాగంగా పాఠశాల నూతన భవన పైఅంతస్తులో స్లాబ్ వేయకుండా అసంపూ ర్తిగా ఉన్న రెండు తరగతి గదులకు, నూతన పాఠశాల బయట నిర్మించి అసంపూర్తిగా ఉన్న మరో రెండు అదనపు తరగతి గదులు నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా అసంపూర్తి పనులు పూర్తి చేయడానికి అవసరమైన సిమెంట్ బస్తాలు, కంకర, ఐరెన్, ఇసుకను సర్వశిక్ష అధికారులు సరఫరా చేశారు. నిర్మాణ పనులకు తొలిదశగా ఇప్పటికే రూ.5 లక్షలు పాఠశాల ఎస్ఎంసీ కమిటీ బ్యాంకు ఖాతాకు నిధులు జమ చేశారు. జిల్లా సర్వశిక్ష ఏపీవో నేరుగా నిర్మాణాలకు అవసరమైన మెటీరి యల్ సరఫరా చేస్తూ పనులు త్వరితగతిన ప్రారంభించి నిర్మాణం పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు. పవన్‌కల్యాణ్ గ్రామస్థులకు ఇచ్చిన భరోసాకు అనుగుణంగా తొలి ప్రాధాన్యతగా పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టడంపై గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





మొగల్తూరు పాఠశాలకు చేరిన సిమెంట్ బస్తాలు, ఐరన్, ఇసుక



ఏలూరు తెలుగు సాహితీ సంబరాల్లో కవులతో గిరిజనులు

అట్టహాసంగా సాహితీ సంబరాలు ప్రారంభం

ఏలూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో అట్టహాసంగా ప్రపంచ సాహితీ సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరు మహాలక్ష్మీ గోపాలస్వామి కల్యాణ మండపం ఆవరణలో సంస్థ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో రెండు రోజులపాటు ఈ సంబరాలు జరగనున్నాయి. గిరిజన సంప్రదాయ నృత్యాలు, కొమ్ము డ్యాన్స్‌లతో సంబరాలు నిర్వహించారు. తొలిరోజు వెయ్యి మంది కవులు, కళాకారులు హాజరయ్యారు. కవుల కవితా గానం, భరత నాట్యం, కూచిపూడి, పుస్తకావిష్కరణ, నాటికలు తదితర కార్యక్రమాలు జరిగాయి. తెలుగు సాహిత్యాన్ని, తెలుగు బాషను, తెలుగు సంస్కృతిని ఖండాంతరాలు వ్యాపింపచేయాలనే ఉద్దేశ్యంతో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ముఖ్య అతిథిగా మాస్ట్రో గజల్ శ్రీనివాస్ హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సిపల్లి హారిక, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ టి.పార్థసారథి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, అధ్యక్షురాలు జి.ఈశ్వరిభూషణం, చిట్టే లలిత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని మాతృదేవోభవ పురస్కారాలను ఉభయ రాష్ట్రాల్లో 50 మందికి, పలువురు సాహితీవేత్తలు, కవులకు అక్షర తేజం కవిరత్న పురస్కారాలను అందజేశారు. తెలుగుభాషా సేవామూర్తులను సత్కరించారు.



ఏలూరులో పలు రకాల విందు ఎదుట కొత్త జంట

కొత్తల్లుడికి 204 రకాలతో విందు

ఏలూరు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): వివాహం జరిగి ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా అత్తారింటికి వచ్చిన కొత్త అల్లుడికి అత్తమామలు 204 రకాల పిండి వంటలు రుచి చూపించారు. ఏలూరు-చాటపర్రు రోడ్డులోని రాఘవేంద్ర టవర్స్‌పక్కన నివాసం ఉంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి మోతుకూరి చంద్రకుమార్, లీలావతి దంపతుల కుమార్తె మోహిని లక్ష్మీప్రియకు కృష్ణా జిల్లా ఉయ్యూరుకి చెందిన లవ కిరణ్‌కి ఇచ్చి వివాహం జరిపించారు. వివాహం జరిపించి ఆరు నెలలు పూర్తి కావడంతో వినూత్నంగా 204 రకాల శాకాహారం, పిండి వంటలు, స్వీట్లు, పండ్లు తదితరులతో ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. ఈ మెగా విందును చూసి అల్లుడు ఆశ్చర్యపోతూ.. ఈ అపురూప విందును శాకాహారంలో ఎప్పుడూ ఊహించలేదని, ఎప్పటికి మర్చిపోలేనని తెలిపారు.

తగ్గిన గుడ్ల ఉత్పత్తి

- బర్డ్‌ఫ్లూ నుంచి తేరుకోని పౌల్ట్రీ పరిశ్రమలు



తణుకు, మే10 (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీ పరిశ్రమ రైతులు వరుస కష్టాలు ఎదుర్కొంటున్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి పౌల్ట్రీ పరిశ్రమను అతలాకుతలం చేసింది. చాలామంది రైతుల నష్టాలపాలయ్యారు. ఆ విపత్తు నుంచి పరిశ్రమ ఇప్పటికీ కోలుకోలేదు. చాలావరకు షెడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బర్డ్‌ఫ్లూ వల్ల ఎక్కువ మొత్తంలో కోళ్లు చనిపోవడం ప్రధాన కారణం. గోదావరి జోన్ పరిధిలో ముఖ్యంగా వేల్పూరు. కానూరు, కానూరు అగ్రహారం, కావలిపురంతో పాటు పలు ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వీరంతా చిన్న రైతులు షెడ్లను లీజుకు తీసుకుని పరిశ్రమ నిర్వహించేవారు. ఆయా రైతులు ఇప్పటికి నష్టాల నుంచి కోలుకోలేదు. ప్రస్తుతం గుడ్డు ధర ఆశించిన స్థాయి ధర పలకడం లేదు. అసలే వేసవికాలంలో కోళ్లు మేత సరిగా తినకపోవడం వల్ల ఉత్పత్తి తగ్గుతుంది. ఈశాన్య రాష్ట్రాల్లో వినియోగం కూడా తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం గుడ్డు ధర రూ.4.75 పైసలు రైతుల వద్ద ట్రేడర్లు కొనుగోలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో కోటి 70 లక్షల కోళ్ల సామర్థ్యం ఉన్నప్పటికి ఆయా రైతుల వద్ద కోటి 40 లక్షల కోళ్లు మాత్రమే ఉన్నాయి. వాటి నుంచి ప్రతిరోజు కోటి 10 లక్షల గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. కాని ఇప్పుడు బర్డ్‌ఫ్లూ వల్ల కోళ్లు చనిపోవడంతో పాటు వేసవి కాలం కారణంగా 70 నుంచి 80 లక్షల గుడ్ల మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. స్థానికంగా సగం వరకు గుడ్లను వినియోగిస్తున్నారు. మిగిలిన సగం ఈశాన్య రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, బిహార్, అస్సాం రాష్ట్రాలకు రోజు 30 లారీల గుడ్లు ఇచ్ఛాపురం బోర్డరుకు వెళుతున్నాయి. ధరల పెరుగుదల కనిపించడంతో రైతులు కొద్దిగా కోలుకునే పరిస్థితి కనిపిస్తుంది. ప్రస్తుతం గుడ్డు ధర వల్ల ఏ మాత్రం లాభాలు ఉండవు, నష్టాలూ ఉండవు. 'నో లాస్ నో ప్రాఫిట్' అన్న చందంగా పరిస్థితి ఉంది.

ధరలు ఇంకా పెరగాలి



ప్రస్తుతం ఉన్న గుడ్డు ధర ఇంకా పెరగాలి. ప్రస్తుతం ఉన్న ధర రూ. 4.75 పైసలు వల్ల రైతులకు ఏమాత్రం లాభం ఉండదు. ఇప్పటికే చాలా సందర్భాల్లో రైతులు నష్టాలు చవి చూస్తున్నారు. బర్డ్‌ఫ్లూ ప్రభావం ఇప్పటికే వెంటాడుతుంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- మల్లిన శ్రీనివాసరావు, నెక్ గోదావరి జోనల్ ఛైర్మన్

అమ్మకు వందనం

నేడు మాతృ దినోత్సవం



'పెదవే పలికిన మాటల్లోన తియ్యని మాటే అమ్మ, కదిలే దేవత అమ్మ కంటికి వెలుగమ్మా' అంటూ ఓ సినీ కవి చెప్పిన మాటలు అక్షర సత్యాలు. అమ్మ ఒడిలో కూర్చుని ఆకాశంలో చందమామను చూస్తూ గోరుముద్దలు తినే పసిబిడ్డకు అమ్మే దైవం అమ్మే సర్వస్వం. ఎంతటి ఉన్నత పదువుల్లో వున్నవారైనా బాల్యంలో అమ్మదనపు కమ్మదనంలో ఎదిగినవారే.. పసిబిడ్డకు తల్లే తొలిగురువు. తొలిదైవం. తొలి పాఠం. తాను పొట్ట మాడ్చుకుంటూ పిల్లల ఆకలి తీర్చేది ఒక తల్లి మాత్రమే. నేడు ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

పాలకొల్లు/పోలవరం, (ఆంధ్రజ్యోతి)

తల్లికి బిడ్డే లోకం

దాదాపు చావు అంచులవరకూ వెళ్లి బిడ్డను కన్న తల్లి ఆ మరుక్షణంలోనే బిడ్డ నవ్వు చూసి అప్పటివరకు తాను పడిన ప్రసవ వేదనను మరిచిపోతుంది. తనబిడ్డ నవ్వితే ఆనందం ఏడిస్తే విచారం. బిడ్డకు ఒక వయసు వచ్చే వరకూ తల్లికి బిడ్డే ప్రపంచం. తన కెరీర్ కాదు తన అందాన్ని ఆరోగ్యాన్ని ఆనందాన్ని బిడ్డ కోసం త్యాగం చేసే గొప్ప గుణం తల్లికి తప్ప ఈ సృష్టిలో మరెవ్వరికీ లేదు.

అమ్మకు థాంక్స్ చెప్పొద్దు ..

మనకు సహాయం చేసిన వారికి మనం థాంక్స్ చెప్పేసి చేతులు దులుపుకుంటాం మహా అయితే వారికి ఏదోవిధంగా సహాయం అందిస్తాం. అమ్మకు థాంక్స్ చెప్పారా ఎప్పుడైనా చెప్పకండి ఎందుకంటే ఒక థాంక్స్‌తో తీరిపోయే రుణం కాదు అమ్మది. ఆమెకి థాంక్స్ చెబితే అమ్మ విలువను మనం తగ్గించినట్లే అవుతుంది.

అమ్మకు వందనం ఇలా..

ఎర్రటి తన రక్తాన్నే తెల్లని పాలగా మార్చి, లాలపోసి ఊపిరూది వేలుపట్టి నడక నేర్పే ఆది గురువు అమ్మే. ఒక తల్లిగా మార్గదర్శిగా చివరకు పెద్ద దిక్కుగా మన జీవితంలో అన్ని దశల్లో అండగా ఉండే అమ్మను గౌరవించి, పూజించి, మన మనసులో నిలుపుకుందాం. వృద్ధాప్యంలో ఉన్న అమ్మను బాధ్యత అనుకోవద్దు ఒక పసిబిడ్డలా చూసుకుని ఆమె జీవిత చరమాంకంలో ఎలాంటి శారీరక, మానసిక ఒత్తిళ్లు లేకుండా హాయిగా గడిపేలా చేయాలి. అదే తల్లిబిడ్డల బంధానికి ఉన్న విలువ మనం ఎన్ని సేవలు చేసినా ఎన్ని కానుకలు ఇచ్చినా తీరని రుణం అమ్మది.

మదర్స్ డే ఎందుకు జరుపుకుంటారంటే..

గ్రీస్‌లో రియా అనే దేవతను మదర్ ఆఫ్ గాడ్స్‌గా అంటే దేవుళ్లకు తల్లిగా కొలుస్తారు. అందుకే ఏడాదికొకసారి ఆ దేవతకు నివాళి అర్పిస్తారు. 17వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో తల్లులకు గౌరవంగా మదరింగ్ డే పేరిట ఉత్సవాన్ని జరిపేవారు. 1872లో జూలియవర్డ్ హోవే అనే మహిళ అమెరికాలో తొలిసారిగా ప్రపంచ శాంతి కోసం మదర్స్‌డే నిర్వహించాలని ప్రతిపాదించింది. అన్నమేరీ జర్విస్ అనే మహిళ మదర్స్ ఫ్రెండ్‌షిప్‌డే జరిపించేందుకు ఎంతో కృషి చేసింది కూడా. మేరీ జర్విస్ మే 9వ తేదీ రెండో ఆదివారం మరణించింది. ఆమె మరణానంతరం ఆమె కుమార్తె తన తల్లి జ్ఞాపకార్థం మిస్ జెర్విస్ మాతృదినోత్సవం కోసం ప్రచారం చేసింది. 1911 నుంచి అమెరికాలోని అన్ని రాష్ట్రాల్లో మాతృ దినోత్సవం జరపడం మొదలయ్యింది. 1914లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ ప్రతియేటా మే రెండో ఆదివారం మాతృ దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని నిర్ణయించారు. కాల క్రమేణా ప్రపంచంలో అన్ని దేశాలు ప్రపంచ మాతృదినోత్సవాన్ని జరుపుకోవడం ప్రారంభించారు.

నిరాదరణలో తల్లులు

మధ్య తరగతి కుటుంబాలలో వృద్ధాప్యంలో తల్లులను అనాథ ఆశ్రమాలకు తరలిస్తుండగా పేద వర్గాలలో నడి రోడ్లపై తమ తల్లులను వదిలి వేస్తున్నారు. సంపన్న వర్గాలలో ఫీడ్ హోమ్‌లలో తల్లి దండ్రులను చేర్చి నెలనెలా సొమ్ములు చెల్లిస్తూ చేతులు దులుపుకుంటున్న ఘటనలు అనేకం. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లకు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో నిరాదరణకు గురైన తల్లులు వస్తున్నారు. అధికారులు స్పందించి వృద్ధులకు న్యాయం చేస్తున్న సందర్భాలున్నాయి. .



అగ్గిపుల్ల, సబ్బుపై మాతృమూర్తి చిత్రాలు

శభాష్.. సురేశ్‌బాబు



ఏలూరు రూరల్ : ప్రపంచ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లిప్రేమను చాటి చెబుతూ ఏలూరులోని ఓ సూక్ష్మ కళాకారుడు అద్భుతమైన కళాఖండాన్ని చెక్కాడు. అగ్గిపుల్ల, సబ్బుపై తల్లీబిడ్డల చిత్రాన్ని చెక్కి ఔరా అనిపించాడు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత మేతర సురేశ్‌బాబు. ప్రతీసారి సందర్భానికి అనుగుణంగా సమాజానికి ఒక చక్కని మేసేజ్ ఇస్తూ అనేక మహానుభావుల విగ్రహాలు చెక్కి చిన్న వస్తువులపై తనదైన శైలితో ప్రత్యేకమైన శిల్పిగా పేరుగాంచాడు. తాజాగా మాతృదినోత్సవం సందర్భంగా తల్లిపై ఉన్న ప్రేమను చాటి చెబుతూ చెక్కిన ఎనిమిది మిల్లీమీటర్ల వెడల్పు, పది మిల్లీమీటర్ల ఎత్తుతో రూపొందించిన ఈ కళాఖండం తయారు చేసేందుకు మూడు గంటల సమయం పట్టింది. ఈ భూమిపై ఉన్న తల్లులందరికీ మాతృమూర్తి ప్రేమను అంకితం చేస్తున్నామని అతను పేర్కొన్నారు. మాతృప్రేమను సూక్ష్మ కళాఖండంలో కళ్లకు కట్టినట్టు చెక్కిన ప్రతిభను చూసి పలువురు అభినందిస్తున్నారు.

మురళీకృష్ణుడిగా శ్రీవారు

- నేటి రాత్రి స్వామి వారి కల్యాణం.. సర్వం సిద్ధం
- నేత్రపర్వంగా ఎదుర్కోలు ఉత్సవం

ద్వారకాతిరుమల, మే 10(ఆంధ్రజ్యోతి): చేతిన పిల్లనగ్రోవి, శిరస్సుపై నెమలిపింఛాన్ని ధరించి నీలమేఘశ్యాముడైన శ్రీకృష్ణుడి అలంకరణలో శ్రీవారు శనివారం భక్తజనులకు దర్శనమిచ్చారు. సర్వాభరణాలు ధరించి ఉన్న ఈ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. వేసవి సెలవులు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో శనివారం దాదాపు 20వేల మంది వరకు భక్తులు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజల అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

హనుమద్వాహనంపై.. తిరువీధులకు శ్రీవారు

భక్తవరదుడైన శ్రీవారు హనుమద్వాహనాన్ని అధిష్ఠించి శనివారం ఉదయం తిరువీధుల్లో ఊరేగారు. చిన్నతిరుమలేశుని వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలలో భాగంగా ధనుర్బాణాలను ధరించి రామావతారంలో కొలువుతీరిన శ్రీవారు హనుమత్ వాహనంపై భక్తజనరంజకంగా తిరువీధుల్లో ఊరేగారు. శ్రీవారి హనుమద్వాహన సేవ నాటి రామరాజ్య వైభవాన్ని పురవీధుల్లో సాక్షాత్కరింప చేసింది. ప్రతీ ఇంటి ముందు భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టారు.



తిరువీధి సేవకు వెళ్తున్న శ్రీవారు, అమ్మవార్లు

శ్రీవారికి ఎదుర్కోలు ఉత్సవం

దివ్యబ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవాన్ని అర్చకులు, పండితులు, అధికారులు, భక్తులతో వేడుకగా నిర్వహించారు. స్వామివారి నిత్యకల్యాణమండపం వేదికైంది. ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగిన ఈ ఉత్సవం చూపరులకు నేత్రపర్వమైంది.

ఎదుర్కోలు ఉత్సవం ఇలా..

స్వామివారి కల్యాణానికి ముందురోజున ఈ ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయం. శ్రీవారి ఆలయ ఆవరణలో వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో స్వామిని ఉంచి



ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అట్టహాసంగా నిత్యకల్యాణ వేదిక వద్దకు తెచ్చారు. అనంతరం హారతులిచ్చి అర్చకులు ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. మండపంలో అర్చకులు, అధికారులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, ఆయన విశిష్టతను కొనియాడారు. రెండో జట్టు అమ్మవార్ల గుణగణాలను, వారి కీర్తిని తెలియజేశారు. వివాహం జరిగే ముందు రోజు వధూవరుల తరఫున బంధువులు శుభలేఖను పఠించేందుకు జరిపే కార్యక్రమమే ఎదుర్కోలుగా పండితులు చెబుతున్నారు.



శ్రీవారి ఆలయంలో విద్యుత్ కాంతులు

నేడు వెంకన్న కల్యాణం

శ్రీవారి దివ్య కల్యాణమహోత్సవానికి దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. చినవెంకన్న కల్యాణాన్ని ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు వైభవంగా జరిపేందుకు కళావైభవాలతో అనివేటిమండపంలో కల్యాణ మండపాన్ని సిబ్బంది ముస్తాబు చేస్తున్నారు. పూలఅలంకరణ పనులు శనివారం రాత్రికి పూర్తవుతాయని ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. కల్యాణవేడుక అనంతరం స్వామివారి తిరువీధి సేవకు వినియోగించే వెండి గరుడ వాహనాన్ని ఇప్పటికే సిద్ధం చేశారు.

క్రైమ్ కార్నర్

బైక్ అదుపు తప్పి.. లారీకింద పడి ఒకరి మృతి

- మరొకరికి గాయాలు

తణుకు, మే10 (ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణ పరిధిలోని ఉండ్రాజవరం జంక్షన్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లా లొల్ల గ్రామానికి చెందిన మట్టా సత్యనారాయణ(38) తన స్నేహితుడితో కలిసి తాడేపల్లిగూడెం నుంచి బైకుపై వస్తుండగా ఉండ్రాజవరం జంక్షన్‌లో బైకు అదుపు తప్పి అటుగా వెళుతున్న లారీ కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడు అక్కడే మృతి చెందాడు. స్వల్పగాయాలతో బయట పడిన స్నేహితుడిని అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో అటువైపు వెళుతున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెంటనే కారులోంచి దిగి పోలీసులకు, 108 సిబ్బంది సమాచారం అందించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసి, 108 అంబులెన్సులో పంపించి మానవత్వాన్ని చాటుకున్న ఆయన తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



ప్రమాద బాధితుడిని అంబులెన్స్‌లో పంపిస్తున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి

ముత్తూట్ గోల్డ్ లోన్ అవకతవకలపై కేసు నమోదు

నరసాపురం టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్తూట్ మినీ ఫైనాన్స్ బ్యాంకు, గోల్డ్ లోన్‌లో అవకతవకాలపై కేసు నమోదు చేశామని పట్టణ ఎస్ఐ సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. స్థానిక స్టీమర్‌రోడ్‌లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో పట్టణానికి చెందిన వై.సుబ్బారావు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ సంస్థలో పని చేస్తున్న వంశీకృష్ణ, సౌజన్య, శ్రీహర్ష కలిసి బ్యాంకులో లోన్ పెట్టిన 22 రుణాలకు సంబంధించి 718 గ్రాముల బంగారంపై అవకతవకలు జరిగినట్లు ఫిబ్రవరి 25న జరిగిన ఆడిట్‌లో బ్యాంకు ఉన్నతాధికారులు గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారులు గడువు ఇవ్వగా... 11 రుణాలకు సంబంధించి లావాదేవీలు సరిచేశారు. మిగిలిన 11 లావాదేవిలకు సంబంధించిన 485 గ్రాముల విలువైన బంగారానికి రూ.16.93లక్షల నగదు తిరిగి సంస్థకు చెల్లించలేదన్నారు. ఈ మేరకు ఆ సంస్థ రీజనల్ మేనేజర్ వేలుపూరి రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఈ-కామర్స్ పేరిట మోసం.. రూ.54 లక్షల టోకరా

నరసాపురం టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): లాభాలు బాగావస్తాయని, పెట్టుబడులు పెడితే డాలర్ రూపంలో కోట్లు వస్తాయని ఓ ప్రొఫెసర్‌ను మోసం చేసిన సంఘటనపై కేసు నమోదు చేశామని నరసాపురం సీఐ యాదగిరి తెలిపారు. వివరాలివి.. పట్టణానికి చెందిన దేవరపు శ్రీనివాస్ విజయవాడలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అతడి వాట్సాప్‌కు మెలీషా అనే ఓ మహిళ మిమ్మలి వివాహం చేసుకుంటానని నమ్మబలికింది. దీనికి అతడు అంగీకరించలేదు. ఈ ఏడాది జనవరిలో మరోసారి క్లౌడేరా వెబ్‌సైట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించింది. ఈసారి ఇది నిజమని నమ్మిన ప్రొఫెసర్ పలు దఫాలుగా ఆ వెబ్‌సైట్‌లో రూ. 54 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. డాలర్ రూపంలో చూస్తే ఆ వెబ్‌సైట్‌లో రూ.3 కోట్ల పైబడి ఉందని, విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించినా.. నగదు తిరిగి రాకపోవడంతో సదరు మహిళను ప్రశ్నించారు. తిరిగి ఇంకా సొమ్ములు చెల్లిస్తే నగదు వస్తుందని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన అతడు టౌన్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు.

మెడికో విద్యార్థికి తీవ్ర గాయం

ఏలూరు క్రైం, 10(ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రాజమహేంద్రవరంలోని మోరంపూడికి చెందిన అప్పిన అశ్వన్(20) ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని మెడికల్ కళాశాల హాస్టల్ నుంచి కళాశాల బస్సులో కాలేజీకి వెళ్తుంటాడు. శనివారం ఉదయం అశ్వంత్ బస్సు ఎక్కుతుండగా, డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా బస్సును ముందుకు పోనివ్వడంతో అతడి కుడికాలుపై బస్సు ముందు చక్రం ఎక్కేసింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతడిని ఆస్పత్రి అత్యవసర విభాగానికి తరలించగా, ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం శస్త్రచికిత్స చేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యులు ఎంఎల్‌సీగా నమోదుచేసి, ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

పదకొండు మంది బైండోవర్

చాట్రాయి, మే 10(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలానికి చెందిన 11 మంది ఎక్సైజ్ పాత నిందితులను శనివారం ఎక్సైజ్ అధికారులు చాట్రాయి తహసీల్దార్ గీత ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిందితులతో మాట్లాడుతూ బైండోవర్ కాల పరిమితి ఏడాది ఉంటుందని, మళ్లీ ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానాతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు.



కాజ మేజర్ డ్రెయిన్‌లో తవ్వకం పనులు చేపట్టిన మంత్రి నిమ్మల రామానాయుడు

అన్నదాతలకు అధిక ప్రాధాన్యం : మంత్రి నిమ్మల

- రూ.3.67 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

యలమంచిలి, మే 10(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి మురుగు కాలువల్లో పూడికతీత పనులు, పంటలకు ఎరువులు, పండించిన ధాన్యాన్ని తరలించుకోవడానికి ఉపయోగపడే గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేస్తున్నామని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. 'మన రైతు.. మన రామానాయుడు' కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడవిపాలెం, మేడపాడు, నేరేడుమిల్లి గ్రామాల్లో రూ.3.67 కోట్ల నిధులతో చేపట్టనున్న డ్రెయిన్ల తవ్వకం పనులు, గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి నూతనంగా నిర్మించిన మేడపాడు-రావిపాడు రహదారిని శనివారం ఆయన ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. మేడపాడులో ఎక్స్‌కవేటర్‌ను మంత్రి రామానాయుడు స్వయంగా నడిపి కాజ మేజర్ డ్రెయిన్ తవ్వకం పనులను ప్రారంభించి మాట్లాడారు. జగన్ ఇసుక, లిక్కర్, మైనింగ్, విలువైన భూములను దోచుకోగా.. స్థానిక వైసీపీ నాయకులు క్రికెట్ బెట్టింగ్ మాఫియాను నడిపి యువతను లూటీ చేశారని విమర్శించారు. నేటి ప్రభుత్వం రైతులకు మేలుచేసే దేవుడని రైతులే చెబుతున్నారన్నారు. ధాన్యం సొమ్ములను 48 గంటలలోపే రైతుల ఖాతాల్లో జమచేసి ఇది రైతు ప్రభుత్వమని నిరూపించామన్నారు. కార్యక్రమాల్లో మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, వాసురాజు, బొప్పన హరికిషోర్, ఆరుమిల్లి రామశ్రీనివాస్, చల్లా నరేంద్రకుమార్, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువకుడి వీరంగం !

- రిక్షా కార్మికుడిపై కర్రతో దాడి
- భయాందోళనలో జనాలు
- పోలీసుల అదుపులో నిందితులు

పాలకొల్లు, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక టాక్సీ స్టాండ్ సెంటర్‌లో శనివారం రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో ఓ యువకుడు వీరంగం చేశాడు. ఒక రిక్షా కార్మికుడిని రక్తం వచ్చేలా కర్రతో చితక బాదాడు. అడ్డుకునేందుకు వెళ్లిన వారిపైనా దాడికి పాల్పడ్డాడు. ఒక చేతిలో బ్లేడు, మరో చేతిలో వాడి పారేసిన పాత ట్యూబ్‌లైట్‌ను పట్టుకుని జనాలపై దాడికి ప్రయత్నించగా అతడి సహచరుడు అదుపు చేశాడు. ఈ విషయాన్ని పాలకొల్లు మానవతా శాఖ కన్వీనర్ ముత్యాల రామారావు పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా పోలీసులు ఘటన స్థలానికి వచ్చిన తరువాత యువకుడు మరింత రెచ్చిపోయాడు. గంజాయి మత్తులో ఉండి వీరంగం చేస్తున్నట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి పట్ల మర్యాద ప్రవర్తిస్తూ దాడి అదుపు చేస్తున్న మరో యువకుడిని పోలీసులు లాక్కుని వెళ్లడం చర్చనీయాంశమైంది. నేరుగా రిక్షా పుల్లర్‌పై దాడి చేసి రక్తం వచ్చినట్టు బాదిన సైకోని చూసి పోలీసులు భయపడుతున్నారా? అని ప్రజలు మాట్లాడుకున్నారు. నేరాన్ని అదుపు చేయడానికి ప్రయత్నించిన యువకుడిని పోలీసులు లాక్కువెళ్లడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి.



యువకుడిని అదుపు చేస్తున్న స్థానికులు

వైభవంగా శ్రీకాలభైరవి అమ్మవారి తిరునాళ్లు



పెదవేగి, మే 10(ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని శ్రీకాలభైరవీ అమ్మవారి తిరునాళ్ల వైభవంగా జరుగుతున్నాయి. మూడోరోజు శనివారం ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు తాతా శారద, రాజులపాటి బాపనయ్య, మారగాని పద్మారావు, సింహాద్రి కాసులు పాల్గొని భక్తులకు చేసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పీకల్లోతు కష్టం...



ద్వారకాతిరుమలలో తిరుకల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని జరుగుతున్న తిరువీధి సేవలో భాగంగా చెరువు వీధిలో రహదారిపై మురుగు నీరు పారుతోందని అర్చకులు స్థానికులు మండల అధికారులకు ఫోన్ చేశారు. దీంతో అధికారులు పారిశుధ్య కార్మికులను రంగంలోకి దించారు. అయితే ఆ కార్మికుడు మురుగు కాలవలోని వ్యర్థాల తొలగింపునకు ఇదిగో ఇలా కష్టపడుతున్నాడు.

పట్టిసీమ క్షేత్రంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి

పోలవరం, మే 10(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ సుదర్శన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శనిత్రయోదశి సందర్భంగా భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత సుదర్శన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9 శనివారాల భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించుకున్నట్టు ఆలయ అర్చకులు శంకరమంచి వెంకట్రామ శర్మ తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకులు కరిబండి నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సైనికుల యోగక్షేమాల కోసం పూజలు చేశారు.

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

పెదపాడు, మే10(ఆంధ్రజ్యోతి): వీరమ్మకుంట గ్రామంలో అభయాంజనేయస్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ మేరకు శనివారం ఉదయం అభయాంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠను నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు బ్రహ్మశ్రీ షైలవరపు సోమశేఖర కృష్ణప్రసాద్ శాస్త్రి ఆధ్వర్యంలో విగ్రహ దాత కలిపిండి సత్యనారాయణ, శివలీల దంపతులు పూజలు నిర్వహించారు.

పంచాయతీల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టి.నర్సాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని గ్రంథాలయ పునర్ వికాస ఉద్యమ వేదిక కార్యకర్తలు ప్రభుత్వాన్ని కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారిని జి.మణికుమారిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. విజ్ఞప్తిపై స్పందించిన ఎంపీడీవో మణికుమారి తన పరిధిలో ఉన్న సెస్ బకాయిలను పదిరోజుల్లో జమ చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యదర్శి బి.ఎన్.సాగర్, ఏలూరు జిల్లా గ్రంథాలయ పునర్ వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ నాగాస్త్ర, విజన్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్, నిమ్మగడ్డ అశోక్‌బాబు పాల్గొన్నారు.



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న సంఘ నాయకులు

ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలి

టి.నర్సాపురం, మే 10(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పొందుపర్చిన అంశాల అమలులో కేంద్రం ఘోరంగా విఫలమైందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు మండిపడ్డారు. టి.నర్సాపురం పంచాయతీలోని గండిచెరువులో పని చేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను శనివారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు, వీరంకి వెంకట్రావు, పులి సత్యనారాయణ, కొండపల్లి మంగయ్య పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ప్రకృతి సాగు రైతులకు ఘన సన్మానం

కామవరపుకోట, మే 10(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం చేస్తున్న నల్లూరి గంగరాజు, పెరవలి యేసుబాబు, కట్టా చింతయ్య, నల్లూరి కాంతారావు, కొట్టు మధుబాబులను తడికలపూడి సచివాలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ప్రకృతి వ్యవసాయం టీమ్ సభ్యులు సుబ్బరాజు, ప్రమీల, తడికలపూడి సర్పంచ్ కొత్తపల్లి రజిని, మాజీ సర్పంచ్ మేరుగు సుందరరావుల ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.నాగరాజు, గ్రామ రెవెన్యూ పరిపాలనాధికారులు మాదు లక్ష్మీనారాయణ, బి.రమేష్ పాల్గొన్నారు.



పెదబాబుకు పూలే చిత్రపటాన్ని అందజేస్తున్న బీసీ సంఘ నాయకులు

బీసీల సమస్యలపై పెదబాబుకు వినతి

ఏలూరు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి) : బీసీ నాయకులు, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్.పెదబాబును శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సమస్యలపై చర్చించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందే వారికి దిశానిర్దేశం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి, ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పామర్తి ఏసురాజు, బీసీ నాయకులు ఉక్కుసూరిగా గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రైల్లో పోగొట్టుకున్న బ్యాగు తిరిగి అందజేత



బ్యాగు అందజేస్తున్న రైల్వే పోలీసులు

ఏలూరు క్రైం 10(ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణంలో ఓ మహిళ పోగొట్టుకున్న బ్యాగును ఏలూరు రైల్వే పోలీసులు తిరిగి అందజేశారు. విజయవాడకు చెందిన రమాదేవి ఈ నెల 9న తిరుపతిలో బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి హాజరై, తిరిగి అదే రోజు రాత్రి తిరుపతి నుంచి కాకినాడ పోర్టుకు వెళ్లే రైలు ఎక్కింది. 10వ తేదీ ఉదయం విజయవాడలో దిగారు. ఆ సమయంలో తన వెంట ఉన్న లగేజీ బ్యాగును రైల్లో మర్చిపోయింది.. రైలు దిగాక బ్యాగును మర్చినపోయిన విషయాన్ని గమనించి, విజయవాడ రైల్వే పోలీసులకు రమాదేవి ఫిర్యాదు చేశారు. అప్పటికే ఆ రైలు విజయవాడ దాటి ఏలూరు చేరింది. వెంటనే అలర్ట్ అయిన స్థానిక పోలీసులు ఆ బ్యాగును స్వాధీనం చేసుకుని శనివారం ఉదయం సదరు మహిళకు అందించారు. ఆ బ్యాగులో రూ.13,500లు నగదు, 21 తులాల బంగారం, సెల్ ఫోన్, ఇంటి తాళాలు ఉన్నాయి. వాటి విలువ రూ.17 లక్షలు ఉంటుందని మహిళ తెలిపింది. దీంతో రైల్వే ఎస్ఐ సైమన్, విజయవాడ రైల్వే డీఎస్పీ రత్నరాజు, సీఐ దుర్గారావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

భానుడి ఉగ్ర రూపం..



నిర్మానుష్యంగా గూడ్స్ షెడ్డు రోడ్డులోని తూర్పు రైల్వే కౌంటర్ సెంటర్



ఉష్ణతాపంతో ప్రజలు తల్లడిల్లారు. చెదురుమదురు వర్షాలతో కొంత చల్లబడిన వాతావరణం శనివారం మాత్రం ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. భానుడి ఉగ్ర రూపానికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. వీధుల్లో తిరగాలంటేనే భయపడాల్సి వచ్చింది. ఈ తాపానికి తాళలేక పలు సెంటర్లలో షాపింగ్‌లు కూడా మూసివేశారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్ల జన సంచారం లేక మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

- ఏలూరు కార్పొరేషన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెదపాడు, మే 10(ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ హైస్కూల్లో 1994-95 సంవత్సరపు పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం ఘనంగా జరిగింది.పెదపాడు హైస్కూల్లో 30 ఏళ్ల క్రితం 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకచోటకు చేరి ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారంతా ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. సుమారు రూ.30 వేలతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ మేరకు త్వరలో కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.



1994-95 సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో





చల్లచింతలపూడి, పంగిడిగూడెం అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న మాతృ దినోత్సవం

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు పాదాభివందనం

దెందులూరు / ద్వారకాతిరుమల, మే 10 (ఆంధ్రజ్యోతి): దెందులూరు సెక్టార్ సూపర్ వైజర్లు చిట్టెమ్మ,శ్రీదేవి, పద్మభూషణం ఆధ్వర్యంలో చల్లచింతలపూడిలో మాతృ దినోత్సవం నిర్వహించారు. పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం మాతృమూర్తుల పాదాలను చిన్నారుల చేత కడిగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం-2 అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలతో తల్లుల కాళ్లు కడిగించి పాదాభివందనం చేయంచారు. చిన్ననాటినుండే పిల్లలకు ఇటువంటి మంచి అలవాట్లు అలవర్చుకునేలా పెద్దలు చర్యలు తీసుకోవాలని సెక్టార్ సూపర్వైజర్ టి.మేరీ అన్నారు. అనంతరం అంగన్వాడీలో చదువుకుని ఉన్నత స్థానానికి చేరిన పిల్లల తల్లులను సత్కరించారు.



బుట్టాయగూడెంలో నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ



చింతలపూడిలో నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

వీరజవాన్ మురళి నాయక్‌కు నివాళులు

బుట్టాయగూడెం, మే 10(ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్‌కు శనివారం రాత్రి కూటమి నాయకులు నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నెహ్రూబొమ్మ సెంటరులో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మొగపర్తి సోంబాబు, కె.రామకృష్ణ, వంకా కాంచనమాల, జి.వి.ఎస్.నాయుడు, ఎన్.కృష్ణమోహన్, కె.నరేష్, మాటూరి మునలయ్య, మనెల్లి బాలు, మడకం కన్నపరాజు, పునులూరి అచ్యుతరావు, దెయ్యాల సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

● చింతలపూడి : వీర మరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన వీర జవాన్ మురళీ నాయక్‌కు స్థానిక హిందూ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్‌లో నివాళులర్పిస్తూ అంజలి ఘటించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, చిల్లపల్లి మోహన్ రావు, టి.వరప్రసాద్, నిమ్మగడ్డ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్

నూతన కార్యవర్గం ఎన్నిక

తణుకు, మే 10(ఆంధ్రజ్యోతి) : ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం తణుకు ఎన్జీవో హోంలో జరిగాయి. రాజమండ్రి డివిజన్ అధ్యక్షులు టి.రాము ఎన్నికల అధికారిగా, డివిజన్ సెక్రటరీ స్వామినాయుడు సహాయ అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఏలూరు డివిజన్ అధ్యక్షుడిగా పి.రాజేశ్ బాబు, కార్యదర్శిగా వై.నాగేంద్ర ప్రసాదు, కోశాధికారిగా బీవీ బాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.ప్రశాంత్ కుమార్, ఆఫీస్ సెక్రటరీగా వై.జయశ్రీ,ఉపాధ్యక్షులుగా జి.సతీశ్ కుమార్, సి.హెచ్. నరేశ్,సహాయ కార్యదర్శులుగా కె.ఎస్.ఎస్.యాదవ్, ఎం.రాజేష్ తదితరులు ఎన్నుకోవడం జరిగింది.అనంతరం ఘనంగా కార్యవర్గ సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు.



ఎన్నికైన టీడీపీ కమిటీని అభినందిస్తున్న నాయకులు

గాలాయగూడెం గ్రామ కమిటీ ఎన్నిక

దెందులూరు, మే 10(ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి ఎమ్మెల్యే చింతమనేని ఆదేశాలతో గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) తెలిపారు. శనివారం దెందులూరు మండలంలోని పలు గ్రామాలకు పార్టీ కమిటీల క్లస్టర్ ఇంచార్జీ గారపాటి కొండయ్య చౌదరి, మోతుకూరి నాని బాబు ఆధ్వర్యంలో నియమించారు. గాలాయగూడెం గ్రామాధ్యక్షుడిగా రెండో సారి పూజారి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత మండలాధ్యక్షుడు ఏనుగు రామకృష్ణ, బోడేటి మోహన్‌బాబు, యలమర్తి శ్రీనుబాబు, ఇప్పిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దెందులూరు తెలుగు యువత అధ్యక్షుడిగా బాలు

దెందులూరు గ్రామ తెలుగు యువత అధ్యక్షుడిగా దెందులూరు పంచాయతీ వార్డు మెంబర్‌గా ఉన్న బుర్లే బాలకృష్ణ (బాలు)యాదవ్‌ను క్లస్టర్ ఇంచార్జి గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తోట యేసమ్మ, సంపంగి వేణుగోపాల తిలక్, వీరమాచినేని ప్రభాకర్, పెనుబోయిన మహేశ్ యాదవ్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.



రామచంద్రరావు పేటలో శ్రీవారి కల్యాణ మహోత్సవం, శనివారపు పేటలో కల్యాణమూర్తులు

వైభవంగా శ్రీవారి వైశాఖ కల్యాణ మహోత్సవం

ఏలూరు కార్పొరేషన్, మే10(ఆంధ్రజ్యోతి) : రామచంద్రరావు పేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.వేద మంత్రాలు, బాజాభజంత్రీలు, అశేష భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, వేద పండితులు యనమండ్ర రవిప్రకాశ్ శర్మావధాని, టీటీడీ స్వర్ణ పథక గ్రహీత కిళాంబి వేంకట పవన కృష్ణమాచార్యులు బృందం భక్తులతో పూజలు, కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఈవో తెలిపారు. 12న త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి ఉత్సవ మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారని ఆయన తెలియజేశారు.

● ఏలూరు రూరల్: శనివారపుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి 64వ వార్షిక వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం అభిషేకాలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు,అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణ నడుమ పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. కమిటీ ప్రతినిధులు కడిమి గంగాధర్‌రావు, వీరమనేని వెంకట పద్మనాభరావు, ఆలయ ప్రధానార్చకులు ముత్తేవి రామ్‌గోపాల్ ఉత్సవాలను పర్యవేక్షించారు.

రూ. 50 లక్షలతో రోడ్ల నిర్మాణం



రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): నగరంలో రూ.50 లక్షలతో నూతన రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్టు ఎమ్మెల్యే చంటి తెలిపారు. 49వ డివిజన్ లక్ష్మీనగర్‌లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఎప్పటి నుంచో రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని అడుగుతున్నట్టు వాపోయారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే చంటి ఎన్నికల ముందు లక్ష్మీనగర్ వాసులకు ఇచ్చిన హామీ మేరకు నూతన రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేక రోడ్లన్ని మునిగిపోతున్నాయన్నారు. పందులు, కుక్కలు కూడా కాలనీ బయటకు పంపే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి నగరంలో నూతనరోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గొల్లపల్లి మురళీ, టీడీపీ నాయకులు తంగిరాల సురేశ్, కార్పొరేటర్ శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ నెరుసు గంగరాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఎ.ఎం.ఆంజనేయులు

ఉచితంగా వైద్య సేవలు

ఏలూరు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి) : రామచంద్రరావు పేటలోని శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆధ్వర్యంలో శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శనివారం ఉచిత వైద్య సేవలతో పాటు మందులు, విలువైన రక్త పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయంపాలెంలో సంచార వైద్య సేవలు

టి.నర్సాపురం : బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సాయంపాలెం గ్రామంలో శనివారం సంచార వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఎ.ఎం.ఆంజనేయులు ఆధ్వర్యంలో అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగులకు ఇంటికి వెళ్లి వైద్య సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఏడుకొండలు, సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఏఎన్ఎం నాగమణి పాల్గొన్నారు.



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వ్యాను

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

ఏలూరు క్రైం, మే 10(ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ విధానంలో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. రూ.60 లక్షల విలువైన రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిస్తున్నారన్న సమాచారంతో శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. అందిన ముందస్తు సమాచారం మేరకు దారికాచి నాలుగు టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏలూరుకు చెందిన కొనకళ్ల మనోజ్ సాయి కుమార్ ఈ బియ్యాన్ని వ్యానులో ఎవ్వరికీ తెలియకుండా తరలిస్తుండగా మాదేపల్లి వద్ద విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నరు. మనోజ్ సాయి కుమార్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ డి.ప్రసాద్ కుమార్, ఎస్.ఐ నాగరాజు, వారి సిబ్బంది పాల్గొన్నారు.



అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

మద్ది క్షేత్రంలో అభిషేకాలు

జంగారెడ్డిగూడెం, మే 10(ఆంధ్రజ్యోతి) : మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంపై స్వామి వారి ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో వివిధ సేవలు, విరాళాల రూపంలో రూ. 1,57,874 ఆదాయం సమకూరినట్టు ఈవో ఆర్.వి.చందన తెలిపారు.

తప్పిపోయిన బాలుడిని శిశుగృహానికి తరలింపు..

ద్వారకాతిరుమల, మే 10(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల యూనియన్ బ్యాంకు సమీపంలో ఒంటరిగా తిరుగుతున్న బాలుడ్ని పోలీస్ స్టేషన్ నుంచి శనివారం ఏలూరులోని శిశుగృహానికి తరలించారు. తన పేరు గోపాల్ అని తన తండ్రి పేరు నాయక్ అని మాత్రమే చెబుతున్న ఈ బాలుడు ఒక్కడే బ్యాంకు వద్ద తిరుగుతూ స్థానికులకు శుక్రవారం కన్పించాడు. అయితే బాలుడికి సంబంధించి ఎవరూ రాక పోవడంతో శిశుగృహానికి పంపినట్లు పోలీసులు తెలిపారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న నగేశ్

ఆయుర్వేద మందుల పంపిణీ

ఏలూరు కార్పొరేషన్, మే 10(ఆంధ్రజ్యోతి) : రామకోటి ప్రాంగణంలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేసి 120 మందికి మందులు ఉచితంగా అందజేశారు. ఆయుష్ వైద్య నిపుణులు బి.వి.ఎం.నగేశ్ ఆధ్వర్యంలో పరీక్షలు జరిపి కౌన్సెలింగ్ ఇచ్చారు. శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు మిత్రబృందం మజ్జిగను పంపిణీ చేశారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న చింతమనేని

పశు బీమాపై భరోసా కల్పించండి

పెదవేగి, మే 10(ఆంధ్రజ్యోతి) : పశు బీమా పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి, రైతుకు భరోసా కల్పించాలని పశు సంవర్థక శాఖ రాష్ట్ర సంచాలకుడు టి.దామోదర నాయుడుని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు. విజయవాడలో పశుసంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకుడిని శనివారం ఎమ్మెల్యే ప్రభాకర్ కలిసి పశు బీమా పథకం అమలుపై చర్చించారు.దీనిపై స్పందించిన దామోదర నాయుడు పశు బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే ప్రభాకర్ తెలిపారు.



ఎన్నికైన కమిటీని అభినందిస్తున్న దృశ్యం

టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక

పెదవేగి, మే 10(ఆంధ్రజ్యోతి) : పెదవేగి టీడీపీ గ్రామ కమిటీని సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ గ్రామాధ్యక్షునిగా కంచెన మోహనరావుతో పాటు కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ మేకా కనకరాజు, పార్టీ నాయకులు రమేష్, మాణిక్యాలరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



బంధించిన శునకాలు

ఎట్టకేలకు శునకాల పట్టివేత

ద్వారకాతిరుమల, మే10(ఆంధ్రజ్యోతి):కొంత కాలంగా అటు ఆలయంలోను, ఇటు గ్రామంలోనూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న శునకాలను ఎట్టకేలకు అధికారులు బంధించారు. శేషాచల కొండపై భక్తుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పెట్టే వాటిని వలపన్ని పట్టుకున్నారు. దాదాపు 70 శునకాలను బంధించినట్టు సిబ్బంది తెలిపారు. వైరస్ వ్యాధి బారిన పడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. బంధించిన ఈ కుక్కలను జి.కొత్తపల్లి అటవీ ప్రాంతంలో విడిచి పెడతామని చెబుతున్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



కలిదిండి మే 10 (ఆంధ్రజ్యోతి): భాస్కరావుపేటలో శనివారం గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు కారే బుజ్జిబాబు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు మంతెన సుబ్బరాజు, సతీష్ రాజు, సర్పంచ్ గద్దె ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ కిశోర్ మృతి



డాక్టర్ కిశోర్ (ఫైల్)

నూజివీడు, మే 10 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో ప్రముఖ సర్జన్ డాక్టర్ పాకలపాటి కిశోర్(65) శనివారం నూజివీడు నివాసగృహంలో మృతిచెందారు. గత కొద్దినెలలుగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఆయనకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు సన్నిహితులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



అలంకరణలో వేణుగోపాలస్వామి, అమ్మవార్లు

జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): వడాలి గ్రామంలోని సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఈ ఉత్సవాలను ప్రారంభించి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ జగన్నాథస్వామి తన్మూర్తి ప్రత్యామ్నా య శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, టీడీ పీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, పార్టీ నాయకులు చలసాని జగన్మోహనరావు, బొంగు రవికుమార్, పరసా విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొని పూజలు జరిపారు. అనంతరం కోడూరు గ్రామంలో శ్రీ లోకేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో వార్షిక కల్యాణోత్సవాలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. స్వామివార్లను అర్చకులు పెండ్లి కుమా రుడు, పెండ్లి కుమార్తెలుగా చేసి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



కలిదిండి మే 10 (ఆంధ్ర జ్యోతి): కోరుకొల్లులో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. ఈ నెల 11న స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

కలిదిండి మే 10 (ఆంధ్రజ్యోతి): కలిది ండిలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం శని వారం వైభవంగా నిర్వహించారు. సహ స్రనామార్చన, కుంకు మ పూజ, బలిహరణ తదితర పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కె.శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమ ంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కూటమి నాయకులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

కైకలూరు: కైకలూరు శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సుదర్శనహోమం, తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని పెండ్లికుమారుడిగా అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేశారు. సాయంత్రం మాఢవీధుల్లో గజవాహనంపై ఊరేగింపు చేశారు. కైకలూరుకు చెందిన టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లును నిర్వహించారు. శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామ పారాయణం జరిపారు. రాత్రి కైకలూరుకు చెందిన నాట్యరవళి శ్రీవల్లీ శిష్యబృందం చిన్నారులతో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

ముసునూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లించాలని సీపీఎం జిల్లా నాయకులు జి.రాజు డిమాండ్ చేశారు. శనివారం ముసునూరు, చింతలవల్లి, చెక్కపల్లి, గోపవరం తదితర గ్రామాల్లో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పనిదినాలను 200రోజులకు పెంచి, ప్రతిరోజు కూలీ వేతనం రూ.500 నుంచి 600 వరకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కూలీలకు సకల సౌకర్యాలను కల్పించాలన్నారు.



చింతలవల్లిలో పిల్లలను ఆశీర్వదిస్తున్న తల్లులు

ఘనంగా మాతృ దినోత్సవం

ముసునూరు, మే 10 (ఆంధ్ర జ్యోతి): చింతల వల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాతృ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు తమ పిల్లలకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం సమాజంలో మాతృమూర్తి తమ పిల్లల కోసం చేసే త్యాగాలు, చూపే ప్రేమ అప్యాతలు గురించి అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజకుమారి వివరించారు. అనంతరం తల్లులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు.

11 మంది బైండోవర్

చాట్రాయి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన 11 మంది ఎక్సైజ్ పాత నిందితులను శనివారం ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ గీత ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిందితులతో మాట్లాడుతూ బైండోవర్ కాల పరిమితి ఏడాది ఉంటుందని, మళ్ళీ ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానాతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు.

50 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం

పోతనపల్లి చిన్న తండాలో శనివారం జరిపిన దాడిలో 50 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం చేసి, 4 లీటర్లు సారా స్వాధీనం చేసుకొన్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. మాలావతు సరోజినిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చాట్రాయిలో మూడు గ్రేడ్‌లుగా పంచాయతీల వర్గీకరణ

ప్రభుత్వానికి అధికారుల నివేదిక



చాట్రాయి గ్రామ సచివాలయం

చాట్రాయి, మే 10(ఆంధ్రజ్యోతి): జనాభా ఆధారంగా గ్రామ పంచాయతీల పునర్ వర్గీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2008లో ఆదాయం ప్రాతిపదికన గ్రామ పంచాయతీలను వర్గీకరించటంతో పరిపాలన, ప్రజలకు సేవలు అందించటంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. జనాభా ఆధారంగా గ్రామ పంచాయతీలను పునర్ వర్గీకరణ చెయ్యాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, ఇందుకు అవసరమైన ప్రక్రియ చేపట్టింది. చాట్రాయి మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా జనాభా ప్రాతిపదికన 3 గ్రేడ్‌లుగా వర్గీకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా 4 వేలు పైన జనాభా కలిగిన చాట్రాయి, చనుబండ, పోలవరం, తుమ్మగూడెం, చిత్తపూరు గ్రామ పంచాయతీలను గ్రేడ్-1గాను, 2 వేలు కంటే ఎక్కువ జనాభా కలిగిన మర్లపాలెం, పోతనపల్లి, కోటపాడు, నరశింహారావుపాలెం, చీపురుగూడెం, జనార్దనవరం, చిన్నంపేట గ్రామ పంచాయతీలను గ్రేడ్-2గా గుర్తించారు. 2 వేలు కంటే తక్కువ జనాభా కలిగిన సోమవరం, కొత్తగూడెం, బూరుగుగూడెం, ఆరుగొలనుపేట, పర్వతాపురం, కృష్ణారావుపాలెం గ్రేడ్-3గా గుర్తిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. కొత్త విధానం అమలులోకి వస్తే గ్రామ పంచాయతీల రూపురేఖలు మారుతాయని, అదాయం, గ్రాంట్లు పెరుగుతాయని, సిబ్బంది కొరతను అధిగమించవచ్చునని అధికారులు చెబుతున్నారు.

14 గంటల్లోనే చోరీ కేసును ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్టుతో పాటు బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

ముదినేపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): దొంగతనం జరిగిన సంఘటనపై ఫిర్యాదు అందిన 14 గంటల లోపే నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి చోరీ సొత్తును ముదినేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 6న ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామంలో గుబిలి సుబ్బారావు తన ఇంటికి తాళాలు వేసి భార్యతో కలసి విజయవాడ ఆసుపత్రికి వెళ్లి 9వ తేదీ సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించిన విషయం తెలిసిందే. ఆ ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని 45 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కైకలూరు సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించారు. దీంతో పోలీసుల అనుమానం మేరకు అదే గ్రామానికి చెందిన పిండి శ్రీను అనే వ్యక్తి ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. శనివారం ఉదయం ఆ గ్రామంలో అతన్ని ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు కానిస్టేబుళ్లు వి.నాగబాబు, సిహెచ్.లక్ష్మీ శ్రీకాంత్, ఆర్.పవన్ అరెస్టు చేసి అతని నుంచి దొంగిలించిన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. తాము 14 గంటలలోపే నిందితుడిని అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. నిందితుడిని కైకలూరు కోర్టులో హాజరుపర్చారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు (ఇన్‌సెట్‌లో) నిందితుడిని అరెస్టు చేసి విలేకరులకు వివరాలు చెబుతున్న సీఐ రవికుమార్

ఈదురు గాలులతో విద్యుత్ నష్టం రూ.30లక్షలు



కైకలూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులతో కూడిన భారీవర్షానికి విద్యుత్ సరఫరాకు భారీగా నష్టం చేకూరింది. గత నెల 13వ తేదీన కైకలూరు నియోజకవర్గంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ఎక్కడికక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపోవడమే గాక మండవల్లి మండలం పసలపూడిలో 133 కేవీ విద్యుత్‌లైన్‌కు సంబంధించిన టవర్ కూలిపోవడంతో సహా సుమారు రూ.30లక్షలు ట్రాన్స్‌కోకు నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా కైకలూరు మండలంలో 75 విద్యుత్ స్తంభాలు, 10విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని రూ.10.49లక్షలు నష్టం వచ్చింది. కలిదిండి మండలంలో 30 విద్యుత్ స్తంభాలు, 8 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని రూ.5.78 లక్షలు, మండవల్లి మండలంలో 11 విద్యుత్ స్తంభాలు, 6 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని రూ.3.32 లక్షలు, ముదినేపల్లి మండలంలో 35విద్యుత్ స్తంభాలు, 2 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని రూ. 4.75 లక్షలు నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు. మండవల్లి మండలం పసలపూడి గ్రామంలో సుమారు 50ఎకరాల చేపలచెరువు మధ్యలో నిర్మాణం చేసిన విద్యుత్ టవర్ కూలిపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు దానిని పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. ఆ విద్యుత్ టవర్ నిర్మాణానికి సుమారు రూ.5లక్షలు పైబడి ఖర్చు అవుతుంది. ఇదిలా ఉండగా ఈ నెల 4న విద్యుత్ శాఖకు మరో ఎదురుదెబ్బ తగిలింది. మరోసారి భారీ వర్షం ఈదురుగాలులు వేయడంతో నియోజకవర్గంలో 60 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ విద్యుత్ స్తంభాలు ధ్వంసమైన చోట అధికారులు కొత్త విద్యుత్‌స్తంభాలు వేసి దశలవారీగా పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించారు. మరో 4 రోజుల్లో టవర్ నిర్మాణపనులు పూర్తిచేసి పూర్తిస్థాయిలో నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తామని కైకలూరు ఏడీఏ రామయ్య తెలిపారు.

10 గ్రామాలకు టీడీపీ అధ్యక్షుల ఎంపిక

ముసునూరు అధ్యక్షుడి ఎంపిక సమావేశం రసాభాస

ఇద్దరి పేర్లు అధిష్ఠానానికి పంపిన నాయకులు



ముసునూరులో అధిష్ఠానానికి పంపే ఇద్దరు వ్యక్తుల పేర్లు ఉన్న పత్రాన్ని చూపుతున్న నాయకులు

ముసునూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలోని 16 గ్రామాల్లో టీడీపీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను నాయకులు వేగవంతం చేశారు. ఇప్పటికే 10 గ్రామాల్లో నూతన అధ్యక్షుల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. అయితే ముసునూరు గ్రామ టీడీపీ అధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ పడటంతో శనివారం మాజీ మండల అధ్యక్షులు దేవినేని ధలరాం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇరువర్గాల మధ్య మాటాల యుద్ధం కాస్తా ఘర్షణకు దారి తీయడంతో సమావేశం రసాభాసగా మారింది. దీంతో నాయకులు ఇరువర్గాల వారిని శాంతింపజేశారు. ఈ పదవిని ఆశిస్తున్న గార్లపాటి నరసింహారావు, నక్కా యోహానుల పేర్లను అధిష్ఠానానికి పంపుతున్నట్లు పరిశీలకులు అక్కినేని చందు, ఆరేపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కొర్లకుంట అధ్యక్ష పదవికి ఆవుల బాబురావు, గోళ్ళ వెంకటరామయ్య పోటీ పడటంతో పరిశీలకుడు చిట్టినేని శివరామకృష్ణ ఇద్దరు పేర్లను అధిష్ఠానానికి పంపాలని నిర్ణయించారు. చెక్కపల్లి, గోపవరం, రమణక్కపేట, లోపూడి గ్రామాల్లో అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఇంకా ఒక కొలిక్కిరాలేదు.

10 గ్రామాల టీడీపీ నూతన అధ్యక్షులు వీరే..

మండలంలోని చింతలవల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కాటేపల్లి సురేంద్ర, గుళ్ళపూడికి మందలపు ధర్మరాజు, సూరేపల్లికి సళ్ళగుళ్ళ మల్లిబాబు, అక్కిరెడ్డిగూడెంకి బర్మా శ్రీనివాసరావు, బలివేకి కాట్రు రామస్వామి, యల్లాపురంకు యనమనేని బాలకృష్ణ, వలసపల్లికి మెదరమేట్ల సురేంద్ర, చిల్లబోయినపల్లికి కండేపు రామగిరి, వేల్పుచర్లకి మానం గంటేశ్వరరావు, కాట్రేనిపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా మొక్కపాటి వెంకట రామారావులను నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

శోభనాపురం టీడీపీ అధ్యక్షుడిగా దాసరి



ఆగిరిపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): శోభనాపురం గ్రామ టీడీపీఅధ్యక్షుడిగా దాసరి సాయిరాం ఎన్నిక అయ్యారు. ఉపాధ్యక్షులుగా వనమాల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా పామర్తి ఆంజనేయులు ఎన్నిక అయ్యారు. పరిశీలకులుగా మల్లిశెట్టి జగదీష్, వర్ల కృష్ణ, గ్రామ సర్పంచ్ నక్కనబోయిన వేణు, పార్టీ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాక్ ఉగ్రవాదాన్ని ఆపాలి



నూజివీడులో కోట మహిషాసురమర్దిని అమ్మవారికి పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు... ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నూజివీడు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీకి మద్దతుగా నూజివీడు సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ప్రధానవీధుల్లో ప్రదర్శన జరిగింది. ఉగ్రవాదం నశించాలి, జోహార్ మురళీ నాయక్ వంటి నినాదాలతో ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు చలసాని రామారావు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచి పోషిస్తోందని, ఇప్పటికైనా పాకిస్థాన్ బుద్ధి తెచ్చుకోవాలని కోరారు. ఇండియన్ ఆర్మీకి దేశమంతా నైతికి మద్దతు తెలుపుతోందన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీపీఐ నాయకులు ఎన్.నరసింహా, జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్రరావు పాల్గొన్నారు.

బీజేపీ పూజలు

త్రివిధ దళాలకు చెందిన సైనికులు, దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రధానిమోదీకి ప్రపంచం యావత్తు అండగా నిలవాలని కోరుతూ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నూజివీడు కోటమహిషాసురమర్ధిని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ భారత స్వాధీనం కావాలని, ఆ భూభాగం పై త్రివర్ణ పతాకం ఎగరాలని ఆకాంక్షించారు. యుద్ధంలో అసువులు బాసిన మురళీనాయక్‌కు సంతాపం తెలిపి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు వై.ఎస్ దొర్రై, జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, మాటూరి రవికాంత్, మాటూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

మంత్రి పార్థసారథి పరామర్శ



అప్పారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన అన్నే అప్పారావు అనారోగ్యంతో బాధపడుతున్నారని ఇంటికి వెళ్ళి వారిని మంత్రి పార్థసారథి పరామర్శించారు. మెరుగైన చికిత్సకోసం ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం కృష్ణవరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సుబ్బమ్మ కుటుంబాన్ని మంత్రి పార్థసారథి పరామర్శించారు. సుబ్బమ్మ కుటుంబానికి ప్రభుత్వం తరపున సంక్షేమ అభివృద్ధి పథకాలు అందేలా తన సహాయ సహకారం ఉంటుందన్నారు. అనంతరం సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి : కామినేని



రైతులకు సబ్సిడీపై పశుదాణాను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, మే 10(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధికి పంచాయతీ పాలకవర్గం అధికారులు సమన్వయంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు ట్రావెలర్స్‌బంగ్లాలో కైకలూరు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించి పూర్తిచేయాలన్నారు. తాలుకా, మార్కెట్లో టాయిలెట్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఎక్కడైనా ఆక్రమణలున్నా వాటిని తొలగించాలని సూచించారు. ప్రజాజీవనానికి ఇబ్బందులు కలిగే ప్రతి అడ్డంకిని తొలగించాలన్నారు. అలాగే ముంపు నివారణలో తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు.

పశువులకు రాయితీపై దాణా పంపిణీ

మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని పశురైతులకు 50శాతం సబ్సిడీపై పశువుల దాణాను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అందజేశారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో పశుసంవర్ధశాఖ అధికారుల ఆధ్వర్యంలో 50కేజీల దాణాబస్తా రూ.1110 ఉండగా 50శాతం సబ్సిడీపై రూ.555కే ప్రభుత్వం అందిస్తుందన్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 22న హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్ర భక్తి పూర్వక బైక్‌ర్యాలీ పోస్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆవిష్కరించారు. జైహనుమాన్ ధర్మరక్షణ కమిటీ, విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నేతలు పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, నల్లగోపుల చలపతి, పుప్పాల సూర్యప్రకాశరావు, మంగినేని రామకృష్ణ, బోడావుల జగదీష్, బోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొల్లేరు లంక గ్రామాలకు కుటుంబ సారథులు



కైకలూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు లంక గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ కుటుంబసాధికార సారథులను నియామకం చేస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు తెలిపారు. శనివారం కొల్లేరు గ్రామమైన కొట్టాడలో టీడీపీ కుటుంబసాధికార సారధులను నియామకం చేసి టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్రినాధరాజు మాట్లాడుతూ రాష్ట్రపార్టీ ఆదేశాల మేరకు త్వరలోనే గ్రామ, మండలస్థాయి కమిటీల నియామకాలను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రవడ్డీసాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, కొల్లేరు నాయకులు చిన్నరాజు, సైదు దుర్గారావు, కృష్ణానందరావు, తదితరులు పాల్గొన్నారు.

పి.వి.రావుకు ఘన నివాళులు

ముదినేపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపకులు పి.వి.రావు 73వ జయంతి కార్యక్రమాన్ని ముదినేపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దళిత సంఘాల కార్యాలయంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు సేవా నాగ జగన్ బాబూరావు పి.వి.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదినేపల్లి అంబేడ్కర్ యూత్ అధ్యక్షులు మేడపాటి తంబి, కార్యదర్శి కొప్పుల నాగరాజు పాల్గొన్నారు.

చదరంగంపై ఉచిత శిక్షణ

ముదినేపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలోని మహిది ట్యూషన్ పాయింట్‌లో శనివారం విద్యార్థులకు ఉచితంగా చదరంగంపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ట్యూషన్ పాయింట్ టీచర్ కర్రి మహేశ్వరి విద్యార్థులకు చదరంగంలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. వడాలిలోపాటు పరిసర గ్రామాల విద్యార్థులకు కూడా చదరంగంపై ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు.